



పరామర్శకు పయనం.. అంతలోనే ప్రమాదం!

- ఆటోను ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్ బస్సు
- అక్కడికక్కడే ముగ్గురు మృతి, ఒకరికి గాయాలు
- మృతుల్లో తల్లీ కూతురు

కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల పంచాయతీ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. వీరిలో ఇద్దరు తల్లీ కూతురు కాగా, మరొకరు ఆటో డ్రైవర్..

7



వైసీపీ పాలనలో అక్రమాలపై కొరడా!

కాకినాడ కార్పొరేషన్‌లో పనిచేసిన ఐదుగురు అధికారులకు నోటీసులు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చోటుచేసుకున్న పలు అక్రమాలపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగంలో నిబంధనలు అతిక్రమించిన అధికారులపై ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. గత ప్రభుత్వ హయాంలో అనుమతులు ఇచ్చి అక్రమాలను ప్రోత్సహించి, పన్నుల ఎగవేతకు సహకరించిన అధికారులకు నోటీసులు జారీచేసింది. కార్పొరేషన్‌లో గతంలో పనిచేసిన అధికారులకు నోటీసులు జారీచేసి చర్యలు తీసుకోమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఆదేశాలిచ్చారు. ముఖ్యంగా మడఅడవుల భూమిని ఇళ్ల స్థలాలకు కేటాయించడం, ఆ స్థలాన్ని కార్పొరేషన్ నిధులతో ఫిల్లింగ్ చేయించడం వివాదాస్పదమైంది. దీనిపై అప్పటి ప్రతిపక్ష నాయకులు ఆందోళన చేసినా అధికారపక్షం పట్టించుకోలేదు. పర్యావరణానికి ముప్పు కలిగించే మడ అడవిని అడ్డగోలుగా ఆక్రమించారు. కాకినాడలో విలువైన స్థలాలను ఆక్రమణలకు గురయ్యేటట్టుగా అవకాశం కల్పించారు. ఈట్‌స్ట్రీట్ విషయంలో వేలానికి సంబంధించి అనేక వివాదాలు ఉన్నాయి. గత వైసీపీ ప్రజాప్రతినిధులు అధికారులను అడ్డంపెట్టుకుని వేలంపాటలో కేవలం సంవత్సరానికి రూ.4 లక్షలకే దక్కించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విజిలెన్స్ నివేదికలో పేర్కొన్నట్టు అనేక అంశాలపై ఆరోపణలు వెల్లువెత్తాయి. అరట్లకట్ట సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో సిల్టేషన్ పనుల్లో అవకతవకలు, దుమ్ములపేట గొడౌన్లపై ఆస్తిఎగవేత, పీఆర్ కళాశాలలో ఈట్‌స్ట్రీట్ వేలంలో పారదర్శకత లేకపోవడం, గాంధీ సెంటినరీ స్కూల్ భూముల ఆక్రమణ, హోటల్ ఐశ్వర్యగ్రాండ్ కొనుగోలు, మడ అడవులు భూములను గృహస్థలాల కోసం గుర్తించడం వంటి వివాదాస్పద అంశాల్లో అధికారుల ప్రమేయం ఉన్నట్టు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారాలకు సంబంధించి ప్రిన్సిపల్ సెక్రటరీ గురువారం జీవోఆర్టీ నెం.720 జారీచేశారు. దీని ప్రకారం ఐదుగురు కీలక అధికారులపై క్రమశిక్షణా చర్యలకు సంబంధించి ఉమ్మడి విచారణకు నిర్ణయం తీసుకుంది. అప్పటి కమిషనర్ (ఎఫ్‌ఏసీ)గా ఉన్న సీహెచ్. నాగ నరసింహారావు, అప్పటి సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.సత్యకుమారి, అప్పటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.ప్రభాకర్‌రావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వెంకట్రావు, అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.రమేష్ బాబులకు నోటీసులు ఇచ్చారు. అప్పుడు జరిగిన అవినీతిపై విచారణతోపాటు చర్యలు కూడా తీసుకోవాలని నోటీసులో ప్రిన్సిపల్ సెక్రెటరీ పేర్కొన్నారు. ఐదుగురు అధికారులకు నలుగురు బదిలీపై వెళ్లి వేర్వేరు ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. కె.వెంకటరావు మాత్రం కార్పొరేషన్, స్మార్ట్ సిటీలకు ప్రస్తుతం ఎస్ఈగా ఉన్నారు.

కూలుతుందో.. ఏమో!

ప్రమాదంలో కాకినాడ పెద్దాసుపత్రి



- స్లాబ్‌లకు లీకులు
- పాత భవనాలతో భయం
- జేఎన్‌టీయూ ఇంజనీర్ల పరిశీలన
- తొలగించాలని నివేదిక
- కొత్త నిర్మాణాలకు రూ.500 కోట్లు
- ప్రభుత్వానికి ప్రతిపాదలు
- పవన్ స్పందించాలని డిమాండ్

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పేదలకు పెద్ద దిక్కయిన కాకినాడ జీజీహెచ్ దీనంగా మారింది. వేలాది మంది రోగులకు సేవలందిస్తోన్న విభాగాలు బిక్కుబిక్కుమంటున్నాయి. పాడుబడిన భవనాలు, ఎప్పుడు కూలుతాయో తెలియని బ్లాకులు రోగులు, వైద్యులను నిరంతరం భయపెడుతున్నాయి. అసలే వర్షాకాలం ఆరంభమవడంతో లీకవుతున్న శ్లాబ్‌లు, తడిచిపోతున్న రికార్డులతో జీజీహెచ్ ప్రమాదకరంగా మారింది. ఆసుపత్రికి కొత్త భవనాల నిర్మాణం అత్యవసరమైనా నిధుల్లేక ఈసురోమంటోంది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో పేదలకు పెద్దదిక్కు కాకినాడ జీజీహెచ్. ఏ పెద్ద అనారోగ్యం వచ్చినా వారంతా వచ్చేది ఇక్కడికే. వందలాది మంది ఇన్‌పేషెంట్లు, ఔట్ పేషెంట్లతో ఈ ప్రభుత్వాసుపత్రి నిత్యం రద్దీగా ఉంటుంది. ఇంతటి కీలకమైన కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అనేక ప్రధాన భవనాలు శిథిలస్థితికి చేరుకున్నాయి. ఇవి ఎప్పుడు కూలుతాయో అన్నట్టు మారాయి. అసలే వర్షాల నేపథ్యంలో ఎక్కడికక్కడ అనేక విభాగాల్లో గోడల దగ్గర నుంచి శ్లాబ్‌ల వరకు వర్షపునీరు లీకవుతోంది. దీంతో ఎప్పుడు ఏమవుతుందోననే ఆందోళన అందరినీ వెన్నాడుతోంది.

నిధులెప్పుడిస్తారో..

గతేడాది కాకినాడ జేఎన్టీయూ ఇంజనీర్లు ఈ భవనాలన్నింటిని పరిశీలించారు. వీటిలో అనేక భవనాలు బలహీనంగా ఉన్నట్టు గుర్తించారు. అనేక బ్లాకులు తొలగించాల్సిందేనని ఇప్పటికే నివేదిక ఇచ్చారు. పాడైన భవనాలను తొలగించి వాటి స్థానంలో జీప్లస్ 8 విధానంలో ఆధునిక సౌకర్యాలతో కొత్త భవనాలు నిర్మించాలని ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రూ.500 కోట్ల వరకు ఖర్చవుతుందని తేల్చారు. ఈమేరకు నిధులు విడుదల చేయాలని కోరుతూ కాకినాడ జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి గతేడాది నివేదిక పంపారు. కొత్త భవనాల్లో 600 పడకలు ఉండేలా ప్రణాళికలు రూపకల్పన చేశారు. నిధుల విడుదలకు కలెక్టర్ షాన్‌మోహన్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వైద్యఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు జిల్లా అధికారులు గుర్తుచేసినా ప్రతిపాదనలు పరిశీలిస్తున్నట్టే చెబుతున్నారు. జీజీహెచ్‌కు కొత్త భవనాలు ఎప్పుడు సమకూరుతాయో తెలియని పరిస్థితి. జిల్లా మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి నిధులు విడుదలపై దృష్టిసారించాల్సి ఉంది.

రోజూ వేలాదిగా రోగులు..

జీజీహెచ్ అవుట్ పేషెంట్ విభాగానికి రోజూ రెండు వేలమంది వరకు రోగులు వస్తారు. ఇన్‌పేషెంట్ విభాగంలో 1,600 నుంచి 1,800 వరకు రోగులు ఉంటారు. నిత్యం వేలాది మంది రోగులతో ఆసుపత్రి కిటకిటలాడుతుంటుంది. కార్డియాలజీ, ఆర్థోపెడిక్, గైనకాలజీ, పిడియాట్రిక్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, యూరాలజీ వంటి ఎన్నో విభాగాల్లో రోగులకు కావాల్సిన సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్, ఎక్స్‌రేలు అందుబాటులో ఉంటాయి. ఐసీయూలతోపాటు యాక్టివ్ మెడికల్ కేర్ యూనిట్లు, ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్లు నిరంతరం పనిచేస్తాయి. 24 గంటలూ ఇక్కడ చికిత్స అందుతుంది. అటు జీజీహెచ్‌కు అనుబంధంగా రంగరాయ మెడికల్ కాలేజీ నుంచి వందలాది మంది వైద్యులు, నర్సులు జీజీహెచ్ విధుల్లో ఉంటారు. ఏ అనారోగ్యం వచ్చినా, ప్రమాదాలు జరిగినా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లలేక వేలాదిమంది ఇక్కడకే శస్త్రచికిత్సకు వస్తారు. ప్రధానంగా సోమవారం రోజైతే ఓపీ విభాగాలు కిక్కిరిసిపోతాయి. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల నుంచి రిఫర్ కేసుల సంఖ్య ప్రతి రోజూ ఉంటుంది. ఏ పెద్ద ప్రమాదం జరిగినా ఆయా కేసులను వెంటనే కాకినాడకు రిఫర్ చేసేస్తారు.

బాబోయ్.. ఆ బ్లాకులు..

ఆసుపత్రిలో అనేక భవనాలు దాదాపు 50 నుంచి 60 ఏళ్లు దాటిపోయాయి. దీంతో అనేక బ్లాకులు ఎప్పుడు కూలిపోతాయో అన్నట్టున్నాయి. ప్రధానంగా అడ్మినిస్ట్రేషన్ భవనం రెండో అంతస్తులో శ్లాబ్‌ల నుంచి వర్షం నీరు లీకవడం వల్ల ఎంఆర్‌డీ సెక్షన్‌లో మెడికల్ రికార్డులన్నీ పాడవుతున్నాయి. పైగా స్లాబు పెచ్చులూడిపోవడంతో కొన్ని ప్రత్యేక వార్డులను పూర్తిగా మూసివేశారు. ఇదే భవనంలో ఈఎన్‌టీ, డెంటల్ విభాగాలు, ఓపీ జరిగే విభాగాల్లో షెడ్లు వర్షాలకు పడిపోయాయి. సర్జికల్‌వార్డు, ఆర్థోపెడిక్, అడ్మినిస్ట్రేషన్ భవనం, మెడికల్ వార్డు భవనాలు శిథిలస్థితికి చేరుకున్నాయి. జీప్లస్3 విధానంలో ఉన్న ఈ భవనాలన్నీ కూల్చాల్సిన పరిస్థితి ఉంది. వాస్తవానికి ఈ పాత భవనాలు తొలగించి కొత్త భవనాలు నిర్మించాలని ఎప్పటి నుంచో ప్రతిపాదనలు మూలుగుతున్నాయి. గత వైసీపీ సర్కారు అయితే కేంద్రం నుంచి వచ్చిన నిధులను సైతం దారి మళ్లించేసింది. కానీ ఆసుపత్రి భవనాలు మాత్రం నిర్మించలేదు. పలుసార్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి పర్యటనల్లో పాత భవనాల నిర్మాణాలకు నిధులిస్తున్నట్టు చెప్పినా కనీసం చిల్లిగవ్వ ఇవ్వలేదు.


కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులు

పీ4 బంగారు కుటుంబాలపై సీఎం వీడియో కాన్ఫరెన్స్

కలెక్టరేట్ నుంచి కలెక్టర్ షాన్‌మోహన్.. కార్పొరేషన్ నుంచి వనమాడి హాజరు

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 25 (ఆంధ్రజ్యోతి): పీ4 బంగారు కుటుంబాల దత్తతపై సీఎం చంద్రబాబునాయుడు శుక్రవారం అమరావతి నుంచి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించి లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. ఎన్జీవోలు, పరిశ్రమల యజమానులతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు కూడా బంగారు కుటుంబాలను దత్తత స్వీకరించాలన్నారు. ప్రధానంగా ఉపాధ్యాయులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు. కలెక్టర్ షాన్‌మోహన్ తన క్యాంపు కార్యాలయం నుంచి హాజరయ్యారు. సీపీవో త్రినాథ్ పాల్గొన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, అదనపు కమిషనరు కేటీ సుధాకర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం కొండబాబు మాట్లాడుతూ పీ4 పథకం కింద నగరపాలక సంస్థకు చెందిన ఉద్యోగులు 1,500 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని ఆదర్శంగా నిలిచారన్నారు. ఈనెల 29న కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయంలో వ్యాపారస్తులు, పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించి బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే అంశంపై చర్చిస్తామన్నారు. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎస్ఈ వెంకట్రావు, నగరపాలక సంస్థ మేనేజరు సీతారాం పాల్గొన్నారు.


ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్

ఈవీఎంల గోదాముకు పటిష్ట భద్రత : కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఈవీఎం, వీవీ ప్యాట్‌లకు పటిష్ట భద్రత ఏర్పాటుచేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉన్న ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును శుక్రవారం ఆయనతోపాటు రాష్ట్ర ఎన్నికల కమిషన్ అసిస్టెంట్ సీఈవో, రాష్ట్ర ఈవీఎం నోడల్ అధికారి తాతబ్బాయి, ఇతర అధికారులు పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ప్రతినెలా ఈవీఎం, వీవీప్యాట్ గోదామును తనిఖీ చేస్తున్నామన్నారు. ఆర్డీవో మల్లిబాబు, కాకినాడ అర్బన్ తహశీల్దారు జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహశీల్దారు జగన్నాథం పాల్గొన్నారు.

విదేశీ పర్యటనలో కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్



కలెక్టరేట్ (కాకినాడ), జూలై 25 (ఆంధ్రజ్యోతి): జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా విదేశీ పర్యటనలో ఉన్నారు. ఈనెల 19వ తేదీన ఆయన వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. ప్రస్తుతం జింబాబ్వే దేశంలో పర్యటిస్తున్నారు. జాయింట్ కలెక్టర్ బాధ్యతలను జిల్లా కలెక్టర్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 28న విధుల్లో చేరతారని, వచ్చే సోమవారం కలెక్టరేట్లో జరిగే ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో పాల్గొంటారని అధికారులు వెల్లడించారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా లక్ష్మి



కార్పొరేషన్ (కాకినాడ), జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా సీహెచ్ లక్ష్మి బాధ్యతలు చేపట్టనున్నారు. ఆమె తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులో చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ (సీడీపీవో)గా పనిచేస్తున్నారు. ఉద్యోగోన్నతిపై కాకినాడ జిల్లా పీడీగా రానున్నారు.


ప్రైవేటు బస్సులు పై తనిఖీలు నిర్వహిస్తున్న ఎంవీఐ శ్రీనివాస్

ప్రైవేట్ బస్సులపై రవాణాశాఖ అధికారులు తనిఖీలు

17 కేసులు నమోదు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీవో శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా పరిషత్ సెంటర్లో శుక్రవారం రాత్రి ప్రైవేట్ బస్సులను తనిఖీ చేశారు. మొత్తం 17 బస్సులపై కేసులు నమోదుచేశారు. టాక్స్, డ్రైవింగ్ లైసెన్స్, పర్మిట్‌తోపాటు ఫైర్, ఫస్ట్ ఎయిడ్ కిట్ వంటి భద్రతా నియమాలు పాటించని వాటిమీద కేసులు నమోదు చేశారు. దాడుల్లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు బి.శ్రీనివాస్, కిరణ్, నాగేంద్ర పాల్గొన్నారు.

రేపటి నుంచి ఏపీఈఏపీసెట్ తుది దశ వెబ్ కౌన్సెలింగ్

- కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్‌లో సహాయ కేంద్రం ఏర్పాటు
- రేపటి నుంచి 30వ తేదీ వరకు రిజిస్ట్రేషన్
- ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించవచ్చు

6


తనకు సంబంధం లేని ఫొటోసైట్‌లో ఉంచారని చెబుతున్న అర్జీదారుడు శ్రీనివాస్

అర్జీ ఒకరిది.. ఫొటో మరొకరిది..

ఈ చిత్రంలో కనిపిస్తున్న ఇతడి పేరు దంగేటి శ్రీనివాస్.. ఒకప్పుడు ఆర్టీసీ రెగ్యులర్ డ్రైవర్. కాకినాడ - హైదరాబాద్ రూట్‌లో తిరిగే వెన్నెల బస్సుల్లో డ్రైవర్‌గా పనిచేసేవాడు. 2023 జనవరి ఒకటో తేదీన ఓ ప్రయాణికురాలు తన సీటు మార్చాలని కోరడంతో వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో తనతో డ్రైవర్ శ్రీను అనుచితంగా ప్రవర్తించాడంటూ ఆమె చేసిన ఫిర్యాదు మేరకు శ్రీనును ఆర్టీసీ కాకినాడ డిపో అధికారులు విధుల నుంచి తొలగించారు. అయితే ఆర్టీసీ అధికారులు ఎటువంటి విచారణ జరపకుండా అన్యాయంగా విధుల నుంచి తొలగించి, తన కుటుంబాన్ని రోడ్డున పడేశారని, తనకు న్యాయం చేయాలంటూ.. 2024లో పీజీఆర్ఎస్‌లో జిల్లా అధికారులకు అర్జీ అందజేశాడు. మంత్రి నారాలోకేశ్ వద్దకు వెళ్లి సమస్యను వివరించాడు.ఈ ఏడాది జూన్ 24న సమస్యను వివరిస్తూ పీజీఆర్ఎస్‌లో మళ్లీ అర్జీ అందజేశాడు. ఈ సమస్య అర్జీ స్టేటస్ పరిశీలనకు పీజీఆర్ఎస్ సైట్‌లోకి వెళ్లగా.. ఫిర్యాదుదారు దంగేటి శ్రీను ఒక్కసారిగా షాకయ్యాడు. తన సమస్య పరిష్కారం కాకుండానే పరిష్కారమైనట్టుగా చూపించడమే కాకుండా ఆ సైట్‌లోని ప్రీ విజిట్‌లో తనకు సంబంధం లేని వేరొకరి ఫొటో అప్‌లోడ్ చేశారని బాధితుడు వాపోయాడు. జిల్లా ఉన్నతాధికారులకు అర్జీ అందజేస్తే.. పరిష్కారం కాకపోగా.. 'చిత్ర' విచిత్రాలు కనిపిస్తున్నాయంటున్నారు.

మీ పరిష్కారానికో..



నమస్కారం!

కలెక్టరేట్‌కు వెళ్లినా పరిష్కారం కాని సమస్యలు

- పీజీఆర్ఎస్ అర్జీలపై చిన్నచూపు
- పరిష్కరించినట్టు మెసేజ్‌లు
- విస్తుపోతున్న అర్జీదారులు
- పట్టించుకోని జిల్లా యంత్రాంగం
- అర్జీదారుల లబోదిబో

కలెక్టరేట్ వెళితే సమస్యలు పరిష్కారమైపోతాయా.. చాలామంది కాదనే అంటున్నారు.. ఎందుకంటే కలెక్టరేట్‌కు వెళ్లినా కాళ్లరిగేలా తిరగాల్సిందే.. ఈ రెండు సంఘటనలే అందుకు ఉదాహరణ.. అర్జీలు పరిష్కారం కాకుండానే పరిష్కారమైపోయినట్టు చూపిస్తున్నారు. ఇలా ఎందరెందరివో అర్జీలు మారిపోతున్నాయి.. ఒకరు ఫిర్యాదు అర్జీకి.. వేరొకరి ఫిర్యాదు అర్జీ జతచేసి.. మసిపూసి మారేడు కాయ చేసినట్టుగా చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా కలెక్టరేట్లో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌కు పెద్దఎత్తున అర్జీదారులు వస్తుంటారు. వారం వారం సుమారు 500 మందికి పైగా ఎక్కడెక్కడి నుంచో వ్యయప్రయాసలకోర్చి ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడైతేనే సమస్య పరిష్కారం అవుతుందనేది వారి నమ్మకం. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు చెప్పుకొంటే బాధపోతుందనే విశ్వాసంతో వస్తుంటారు. అలాంటి గ్రీవెన్స్‌కు వస్తున్న అర్జీల్లో చాలా అర్జీలు బుట్టదాఖలవుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలా సమస్యలను పరిష్కారం కాకుండానే పరిష్కరించినట్టుగా మెసేజ్‌ల రూపంలో అర్జీదారులకు సమాచారమిస్తున్నారని అంటున్నారు. అంతేకాదు.. పీజీఆర్ఎస్ సైట్‌లో కూడా అర్జీదారుల వివరాలు,ఫిర్యాదు నంబర్ నమోదులోనూ తేడాలు ఉంటున్నాయని, ఒకరి అర్జీలు, మరొకరికి, ఒకరి ఫొటోలు మరొకరికి జత చేస్తున్నారని చెబుతున్నారు. జిల్లా ముఖ్య ఉన్నతాధికారి కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే గ్రీవెన్స్‌లోనే ఇలా జరుగుతుంటే.. మండల, గ్రామస్థాయిలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఇంకెన్ని చిత్రవిచిత్రాలు జరుగుతున్నాయో ఆ దేవుడికే ఎరుక..

అర్జీ ఒకరిది.. పేరు మరొకరిది..



ఈయన పేరు చీకట్ల కృష్ణయ్య, కాకినాడ. ఆర్టీసీలో డ్రైవర్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసేవారు. కంటి చూపు మందగించిందనే కారణం చూపుతూ ఆర్టీసీ అధికారులు తనను విధు ల నుంచి తప్పించారని, 2023 నవంబర్‌లో పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు విన్నవించారు. సమస్యకు పరిష్కారం దొరకకపోవడంతో తాజాగా మరోసారి ఈ ఏడాది మే 26వ తేదీన కలెక్టరేట్‌కు వెళ్లారు. ఈ నేపథ్యంలో గ్రీవెన్స్ నంబర్: కెకెడి02025052 66239 పేరుతో పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు రిజిస్టర్ చే శారు.అయితే సమస్య పరిష్కారం కాకుండానే అయినట్టుగా జూలై మూడో తేదీన గ్రీవెన్స్ నంబర్ : కెకెడి02025052 66227తో కంప్లైంట్‌ను క్లోజ్ చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే ఇందులో ఫిర్యాదుదారుడు పేరు చీకట్ల కృష్ణయ్య కాగా సమస్య పరిష్కారమైనట్టుగా ఉన్న పేజీలో తుమ్మలపల్లి కృష్ణ అర్జీని జతచేయడం విశేషం.


సమీక్ష చేస్తున్న ఎస్పీ బిందుమాధవ్, అడ్మిన్ ఎస్పీ భాస్కరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు

నేర నియంత్రణకు ఆధునిక సాంకేతికత

అర్ధ సంవత్సర సమీక్షలో ఎస్పీ బిందుమాధవ్.. ఉత్తమ అధికారులకు అభినందన

కాకినాడక్రైం, జూలై25 (ఆంధ్రజ్యోతి): నేరాల అదుపు, నియంత్రణకు ఆధునిక సాంకేతికత ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు. శుక్రవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్, న్యాయ, రెవెన్యూ, హైవే అథారిటీ, విద్య, మున్సిపల్, ఈగిల్ పోలీస్, రైల్వే పోలీస్ అధికారులతో అర్ధ సంవత్సర నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో మహిళలపై జరిగే అనేక రకాల వేధింపులు, హింసను అరికట్టేందుకు నిందితులను గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గంజాయి అక్రమ రవాణాను, వినియోగాన్ని పూర్తిగా అరికట్టడానికి పటిష్ఠమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు జిల్లావ్యాప్తంగా నమోదైన దొంగతనాలు, దోపిడీ, ఆస్తి నేరాలు, హత్యాయత్నం, చీటింగ్, పోక్సో, మహిళా సంబంధిత నేరాలు, మిస్సింగ్ కేసులు, ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కేసులు, ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసులు, రోడ్డు ప్రమాదాలు, డ్రంకన్ డ్రైవ్ కేసులు, ఎంవీఐ యాక్ట్ కేసులు, జూద క్రీడలు, బహిరంగంగా మద్యం సేవించే వారిపై కేసులపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా రహదారులపై పశువుల సంచారంతో జరిగే ప్రమాదాలపై, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సీసీ కెమెరాలు, బ్లాక్ స్పాట్లలో బ్లింకర్‌లు, స్పీడ్‌బ్రేకర్‌లు ఏర్పాటుపై తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై సమీక్షించారు. జిల్లా విద్యాశాఖ పాఠశాలల భద్రతా చర్యలపై ఈగిల్ టీమ్స్ ఏర్పాటు, విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాలపై, మునిసిపల్ అధికారుల ఆధ్వర్యంలో సీసీ కెమెరాల పనితీరు, గ్రీవెన్స్ సెల్‌ల ద్వారా వచ్చిన సమస్యలు, వాటి పరిష్కారాల సమయంలో వచ్చే ఇబ్బందులపై సమీక్షించారు. రైళ్లలో గంజాయి పట్టుకోవడం, మొబైల్, గొలుసు దొంగతనాలపై దర్యాప్తు సమయంలో అవలంబించాల్సిన ప్రక్రియలపై సరైన అవగాహనకు పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, రెవెన్యూ, హైవే అథారిటీ, విద్యాశాఖ, మున్సిపల్ అధికారులు, ఈగిల్ పోలీస్, రైల్వే పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తిచేసేందుకు అవసరమయ్యే సహాయ, సహకారాలను పోలీసు శాఖకు అందిస్తామని ఆయా శాఖల ఉన్నతాధికారులు తెలిపారు. సాంకేతికత ఆధారిత పోలీసింగ్‌తో జిల్లాలో నేరాలు గణనీయంగా తగ్గాయని జిల్లా ఎస్పీ వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాను నేరరహితంగా తీర్చిదిద్దేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సమావేశం అనంతరం గడిచిన నెల రోజుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్. శ్రీనివాసరావు, పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు, ఏఆర్ డీఎస్పీ శ్రీహరిబాబు, ట్రైనీ డీఎస్పీ జీవన, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



ఆర్చ్ బ్రిడ్జికి...

రూ.70 కోట్లతో మరమ్మతులు

మూడేళ్లపాటు పనులు... రైళ్ల వేగ పరిమితి పెంపు

రాజమహేంద్రవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదికి తోరణాలు కట్టినట్టుగా కనిపించే రైల్వే ఆర్చ్ బ్రిడ్జికి మరమ్మతులు మొదలుపెట్టారు. ఆర్చ్‌లకు ఉన్న దీనా హ్యాంగర్స్‌లోని వైర్లను మారుస్తున్నారు. దాదాపు రూ.70 కోట్లతో జరుగుతున్న పనులు పూర్తి కావడానికి మూడేళ్ల సమయం పడుతుంది. గతంలో దీనా హ్యాంగర్ సమస్య రాగా సుమారు రూ.కోటితో మరమ్మతులు చేశారు. ప్రతి రోజూ ఈ వంతెన మీదుగా 50 ప్రయాణికుల రైళ్లు, 40 గూడ్స్ రైళ్లు





ఆర్చ్ బ్రిడ్జి మరమ్మతులు చేస్తున్న కార్మికులు

ప్రయాణిస్తాయి. ప్రయాణికుల రైళ్లకు గంటకు 80 కిలోమీటర్లు, గూడ్స్ రైళ్లకు 60 కిలోమీటర్లు వేగ పరిమితి ఉంది. అయితే పనుల కారణంగా ఆ వేగాన్ని 30 కిలో మీటర్లకు తగ్గించారు. ఈ బ్రిడ్జిపై గంటకు 130 కిలోమీటర్ల వేగంతో రైళ్లు దూసుకుపోయే విధంగా డిజైన్ చేసినా ఎప్పుడూ అంత వేగంతో వెళ్లలేదు.

● **ప్రత్యేకత ఇదీ**

గోదావరి నదిపై 1897లో తొలి రైల్వే బ్రిడ్జి నిర్మించారు. అది వందేళ్లు సేవలందించిన తర్వాత 1997లో మూసేశారు. దీనిని మూసి వేయడానికి ముందుగానే ఆర్చ్ బ్రిడ్జి నిర్మాణం 1991లో మొదలైంది. 1997 మార్చి 12 నుంచి ఈ వంతెనపై రైళ్లు పరుగులు పెడుతున్నాయి. ఈ ఆర్చ్ బ్రిడ్జి చూడడానికి అద్భుతమైన నిర్మాణంగా కనిపిస్తున్నా దీనిలో గొప్ప ఇంజనీరింగ్ సాంకేతికత ఉంది. వాడుకలో ఆర్చ్ బ్రిడ్జి అని పిలుస్తున్నా దీని అసలు పేరు బౌస్ట్రింగ్-గర్డర్ బ్రిడ్జి. వంతెన నుంచి ఇనుప ఊచల మాదిరిగా కనిపించే వాటిని దీనా హ్యాంగర్లు అంటారు. ఇవి మొత్తం 600 ఉంటాయి. వీటిలో ఇనుమ తదితర లోహాలతో చేసిన వైర్లు ఉంటాయి. వాటిని బ్రిడ్జి నుంచి ఆర్చ్‌లకు అనుసంధానిస్తారు. రైలు వెళ్లే సమయంలో బ్రిడ్జిపై పడే భారం ఆ వైర్ల గుండా స్వేచ్ఛగా ప్రయాణించి ఆర్చ్‌లకు చేరుతుంది. అటు, ఇటు చివర్లకు చేరుకోవడం ద్వారా వెలుపలకు వెళ్లిపోతుంది. దీంతో బ్రిడ్జిపై రైలు వేగంగా వెళ్లే అవకాశం కలగడంతో పాటు బ్రిడ్జికి ఎలాంటి ఇబ్బందీ కలగదు.

ఇప్పుడేం చేస్తున్నారు?



ఆర్చ్‌లకు వేలాడుతున్నట్లుగా కనిపిస్తున్న దీనా హ్యాంగర్స్ లోపల వైర్లు ఉంటాయి. ఈ నిర్మాణాన్ని 25ఏళ్ల కాలానికి తగినట్టుగా డిజైన్ చేశారు. ఆ కాలం ముగిసిపోయింది. దీనా హ్యాంగర్ల లోపల ఉన్న వైర్లు ఉబ్బిపోవడంతో బయటకు కనిపిస్తున్న ఇనుప కవర్ పగిలిపోతోంది. అందువల్ల ఆ వైర్లను, బేరింగులను మార్పుచేసి, సాంకేతికతను కూడా భవిష్యత్తులో ఇబ్బంది రాని విధంగా జోడిస్తున్నారు. ఈ బ్రిడ్జి స్పాన్ (స్తంభాలను) కూడా బాగా వెడల్పుగా నిర్మించారు. ఒక్కో స్పాన్ కనీసం 98 మీటర్లు ఉంటుంది. ఒకవేళ నాలుగో వంతెన నిర్మించా లన్నా ఇబ్బంది లేకుండా స్పాన్లలో కొంత భాగా న్ని ఖాళీగా వదిలిపెట్టారు. మనకు తోరణాల మాదిరిగా కనిపిస్తున్న ఆర్చ్‌లు మొత్తం 56 ఉన్నాయి. ఈ బ్రిడ్జి పొడవు 2.745 కిలోమీటర్లు.





డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామలో ప్రత్యేక అలంకరణలో మాణిక్యాంబ అమ్మవారు

అందరికీ శుభాలను, మహిళలకు సౌభాగ్యాన్ని ఇచ్చే శ్రావణ మాసం ఆరంభమైంది. తొలి రోజే శుక్రవారం కావడంతో ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలుచోట్ల అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. కొన్నిచోట్ల సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు కుంకుమ పూజలు చేశారు.

శ్రావణం... శుభారంభం



కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో పుష్పాలంకరణలో లక్ష్మీదేవి



రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో విశేష అలంకరణలో బాలాత్రిపురసుందరి అమ్మవారు





కాకినాడ జిల్లా కరప, కాకినాడల్లో వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు

రేపటి నుంచి ఏపీఈఏపీసెట్ తుది దశ వెబ్ కౌన్సెలింగ్

- కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్‌లో సహాయ కేంద్రం ఏర్పాటు
- ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు రిజిస్ట్రేషన్
- ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించవచ్చు

జేఎన్టీయూకే, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఈఏపీసెట్-2025 అడ్మిషన్లలో భాగంగా ఎంపీసీ విభాగం అభ్యర్థు లకు సంబంధించిన ఆన్‌లైన్ తుది దశ వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ ఆదివారం ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈఏపీ సెట్ అడ్మిషన్స్ కన్వీనర్ జి.గణేష్‌కుమార్ శుక్రవారం జారీ చేశారు. మొదటి దశలో సీటు పొందని, కేటాయించిన సీటులో అడ్మిషన్ తీసుకోని విద్యార్థులు తుది దశ ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్‌కు నమోదు చేసుకునేందుకు అర్హులు. విద్యార్థికి ఏ ర్యాంకు వచ్చినా ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకుని ఆన్‌లైన్ ప్రాసెసింగ్ ఫీజు చెల్లించవచ్చని, ధ్రువపత్రాలను పరిశీలిస్తామని కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్ (ఏపీటీ) సహాయ కేంద్రం సమన్వయకర్త, ప్రిన్సిపాల్ ఎస్.జనార్దనరావు తెలిపారు. ఈ నెల 7న ప్రారంభమైన ఈఏపీసెట్ తొలి దశ కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం ముగియనుంది. అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు సంబంధిత ఇంజనీరింగ్ కళాశాలల్లో తరగతులను ఆగస్టు 4న ప్రారంభించనున్నారు.

● ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 24 ప్రైవేట్, 2 ప్రభుత్వ ఇంజనీరింగ్... మొత్తం 26 కళాశాలలకు 16,660 సీట్లు వున్నాయి. ఈఏపీ సెట్‌లో ఇంజనీరింగ్‌కు కాకినాడ జిల్లాలో 6,343 మంది, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 2,868 మంది, తూర్పు గోదావరి జిల్లాలో 6,011 మంది అర్హత సాధించారు. ఉమ్మడి జిల్లాలో మొదటి దశ ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ ద్వారా కన్వీనర్ కోటాలో సుమారు 70శాతం సీట్లు భర్తీ అయినట్టు సమాచారం. మిగిలిన సీట్లను తుది దశ వెబ్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీచేయనున్నారు.

● అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా కాకినాడ జగన్నాథపురంలోని ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన సహాయ కేంద్రంలో సంప్రదించాలి. 99123 42010 నెంబరుకు ఫోను చేయవచ్చని సహాయ కేంద్రం సమన్వయకర్త జనార్దనరావు సూచించారు.

ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్ : ఈ నెల 27 నుంచి 30 వరకు
ధ్రువపత్రాల పరిశీలన: 28 నుంచి 30 వరకు
వెబ్ ఆప్షన్ల నమోదు: 28 నుంచి 31 వరకు
వెబ్ ఆప్షన్ల మార్పు: ఆగస్టు 1
సీట్ల కేటాయింపు: ఆగస్టు 4
కళాశాలల్లో రిపోర్టింగ్: ఆగస్టు 4 నుంచి 8 వరకు

విద్యార్థులు సిద్ధం చేసుకోవాల్సినవి:

ర్యాంకు కార్డు, మార్కుల జాబితా, హాల్ టికెట్, పుట్టినరోజు, టీసీ, స్టడీ, ఈడబ్ల్యుఎస్, నివాసం, కులం, ఆదాయం, స్థానికత ధ్రువపత్రాలు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధాబిందు

రాజమహేంద్రరం అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ కోసం అర్హులైన ఐటీఐ పాస్ అయిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని విజయనగరం జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.సుధా బిందు ఓ ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో డీజిల్ మెకానిక్, మెటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, విశాఖపట్నం జిల్లాలో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, అనకాపల్లి జిల్లాలో డీజిల్ మెకానిక్, మెటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, అల్లూరి సీతారామరాజు జిల్లాలో డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, విజయనగరం జిల్లాలో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, షీట్ మెటల్ వర్కర్స్, పెయింటర్, మెషినిస్ట్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ట్రేడుల్లో అప్రెంటిస్ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 26 నుంచి ఆగస్టు 9వ తేదీ లోపు తమపేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల వారు ఆగస్టు 11న, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల వారు 12న, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల వారు 13న, శ్రీకాకుళం జిల్లావారు 14న సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు రావాల్సి ఉంటుందని తెలిపారు. ఏమైనా సందేహాలుంటే ఫోన్ నెం. 08922-294906కు ఫోన్ చేయవచ్చని, ఆయా జిల్లాలప్రభుత్వ ఐటీఐల్లోని అప్రెంటీస్ అడ్వయిజరీ సిబ్బందిని కూడా సంప్రదించవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం తమ అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లతో, దరఖాస్తుదారులకు తెలియజేసిన నిర్ణీత తేదీల్లో విజయనగరం వీటీ అగ్రహారంలోని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ వద్ద హాజరుకావాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.5.36 లక్షలు



అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన వారు అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.5,36,450 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

26, 28, 30 తేదీల్లో 20 రైళ్లు రద్దు



ఎల్‌హెచ్‌బీ బోగీలతో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలు

- తాడి-దువ్వాడ మధ్య నాన్‌ఇంటర్ లాకింగ్, ట్రాక్ పునరుద్ధరణ పనులు
- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు

సామర్లకోట, జూలై 25(ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వే సెక్షన్ పరిధిలో తాడి-దువ్వాడల మధ్య నాన్‌ఇంటర్ లాకింగ్, ట్రాక్ పునరుద్ధరణ పనుల నేపథ్యంలో ఈ నెల 26, 28, 30 తేదీలలో 20 రైళ్లను రద్దు చేస్తూ రైల్వే ఉన్నతాధికారులు విజయవాడ నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.సామర్లకోట రైల్వే స్టేషన్ ఉన్నతాధికారికి శుక్రవారం రాత్రి అందిన సమాచారాన్ని ఆంధ్రజ్యోతి సేకరించింది.

● సామర్లకోట జంక్షన్ రైల్వే స్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే 12717 నెంబరు గల విశాఖ-విజయవాడ మధ్య రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, 67285 నెంబరు గల రాజమహేంద్రవరం-విశాఖల మధ్య మెము ప్యాసింజరు ఈ నెల 26, 28, 30 తేదీలలో రద్దు కానున్నాయి.

● 12718 నెంబరు గల విజయవాడ-విశాఖ మధ్య రత్నాచల్ ఎక్స్ ప్రెస్ ఈనెల 26, 28, 30 తేదీల్లో రద్దు కానుంది.

● 22875, 22876 నెంబర్లు గల గుంటూరు-విశాఖ-గుంటూరు మధ్య ఉదయ్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26, 30 తేదీలలో రద్దు కానున్నాయి.

'రత్నాచల్'కు ఎల్‌హెచ్‌బీ బోగీలు

విజయవాడ-విశాఖ మధ్య తిరిగే 12718, 12717 నెంబర్ల రత్నాచల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఆగస్టు 8 నుంచి అధునాతన ఎల్‌హెచ్‌బీ బోగీలను ఏర్పాటు చేస్తున్నట్టు విజయవాడ రైల్వే ఉన్నతాధికారులు శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారికి అందిన సమాచారం ప్రకారం.. మార్పు చేసిన ఈ ఎల్‌హెచ్‌బీ బోగీలలో జనరల్ కేటగిరికి చెంది 8 బోగీలు, చైర్‌కార్ 8 బోగీలు, ఏసీ చైర్‌కార్ 3 బోగీలు, ప్యాంట్రీ కార్ బోగీ ఒకటి, ఈవోజీ ఒకటి, ఎల్ఎస్ఎల్ఆర్‌డీ ఒకటి చొప్పున 22 బోగీలతో విజయవాడ- విశాఖ మధ్య రాకపోకలు సాగించనుంది.

జీఐ-ట్యాగ్‌తో ఉప్పాడ చీరలకు విస్తృత ప్రచారం

ఎంపీ సతీష్‌బాబు ప్రశ్నపై కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ వెల్లడి

కాకినాడ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జీఐ-టాగ్‌తో ఉప్పాడ జాంధానీ చీరలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నామని కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ వెల్లడించారు. పార్లమెంట్‌లో శుక్రవారం టీడీపీ రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో జీఐ-ట్యాగ్ చేసిన ఉప్పాడ జాంధానీ చీరలను ప్రోత్సహించడానికి తీసుకున్న చర్యలు, ఇప్పటి వరకు సాధించిన పురోగతి వివరాలు తెలపాలని కోరారు. గత ఐదేళ్లలో ప్రమోషన్ కోసం కేటాయించిన, ఉపయోగించిన నిధులు, జీఐ హెల్ప్‌డెస్క్ నుంచి ప్రయోజనం పొందిన నేత కార్మికులు ఉత్పత్తిదారుల వివరాలు తెలపాలని ఎంపీ అడిగారు. దీనికి కేంద్ర మంత్రి సమాధానమిస్తూ దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో చేనేత ఉత్పత్తుల మార్కెటింగ్, నేత ముద్ర పథకం కింద రాయితీ రుణాలు, ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం, ముడి పదార్థాల సరఫరా పథకం కింద అర్హత గల చేనేత ఏజెన్సీలు, అప్‌గ్రేడ్ చేసిన మగ్గాలకు కావల్సిన ఉపకరణాలు సమకూరుస్తున్నామని చెప్పారు. సోలార్ లైటింగ్ యూనిట్లు, వర్క్ షెడ్ నిర్మాణం, నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తి, డిజైన్, అభివృద్ధి, సాంకేతిక, సాధారణ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాలో 691 మంది లబ్ధిదారులను కవర్ చేసే ఉప్పాడ క్లస్టర్ అమలుకు రూ.52.78 లక్షలు ఆర్థిక సాయం అందించామన్నారు, ఆర్ఎంఎస్ఎస్ కింద 2020-21లో రూ.60.32 కోట్లు, 2021-22లో 89.53 కోట్లు, 2022-23లో రూ.139.70 కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. ఎన్ హెచ్‌డీపీ కింద 2023-24లో రూ.186.36 కోట్లు, 2024-25లో రూ.195.50 కోట్లు, 2025-26లో రూ.112.28 కోట్లు ఖర్చు చేసినట్టు కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

రేపు ఎయిడెడ్ ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి సీబీటీ

పాఠశాల విద్య జోన్-2 కాకినాడ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు నాగమణి

సర్పవరం జంక్షన్(కాకినాడ)/రాజమహేంద్రవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జోన్-2 పరిధిలోని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎస్తేర్ ఎగ్గిన్ రెసిడెన్సియల్ ఎయిడెడ్ ప్రాథమిక స్కూలు, కొంతమూరు, ఎస్తేర్ ఏగ్గిన్ రెసిడెన్సియల్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఎస్ జీటీ, స్కూల్ అసిస్టెంట్ టీచర్ పోస్టుల భర్తీకి ఈనెల 27న కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) నిర్వహించనున్నట్టు పాఠశాల విద్య జోన్-2 కాకినాడ ఆర్‌జేడీ జి.నాగమణి ఓ ప్రకటనలో తెలిపారు. సీబీటీ మొదటి సెషన్ ఉదయం 9.30నుంచి 11.30గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2నుంచి 4గంటల వరకు జరుగుతుందన్నారు. కాకినాడ అచ్యుతాపురం రైల్వే గేటు సమీపంలోని ఐయాన్ డిజిటల్ జోన్- ఐడీజడ్, రాజమహేంద్రవరం లూథర్‌గిరి సెంటర్లలో సీబీటీ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 98485 74622, 83091 77952 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరిలో మొత్తం 1249 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని డీఈవో కె.వాసుదేవరావు తెలిపారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో శ్రీకొట్ల వెంకటరామయ్య బాలికోన్నత పాఠశాల ఖాళీగా ఉన్న ఎయిడెడ్ టీచింగ్ పోస్టులకు ఈనెల 27న సీబీటీ నిర్వహించనున్నట్టు చెప్పారు. హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్ కోసం 99892 71919 ఫోన్ చేసి సమాచారం పొందాలని కోరారు. ఈ పోస్టుల కోసం ఆన్‌లైన్.ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్‌లో దరఖాస్తు చేసుకున్న వారు cse.ap.gov.in / aidedhallticket ద్వారా హాల్‌టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు.పరీక్షా కేంద్రాలకు 90నిమిషాల ముందు గుర్తింపు పొందిన ధ్రువపత్రంతో హాజరు కావాలని ఆర్‌జేడీ కోరారు.

29, 3 తేదీల్లో ఆర్టీసీ తీర్థయాత్ర స్పెషల్స్



రాజమహేంద్రరం అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా జిల్లా ఆర్టీసీ ప్రత్యేకంగా శ్రావణమాస స్పెషల్ ఒకరోజు తీర్థయాత్ర ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడుపుతున్నట్టు రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె.మాధవ్ తెలిపారు. భక్తుల కోరిక మేరకు ఈనెల 29, ఆగస్టు 3వ తేదీల్లో ఈ స్పెషల్ బస్సులు ప్రారంభమవుతాయన్నారు. స్పెషల్ బస్సులు ఉదయం 5గంటలకు రాజమహేంద్రవరం డిపో నుంచి బయలుదేరి తిరిగి రాత్రి 9 గంటలకు రాజమహేంద్రవరం చేరుకుంటాయని తెలిపారు. నిడదవోలు కోట సత్తెమ్మ అమ్మవారు, కొల్లేటికోట పెద్దింట్లమ్మ అమ్మవారు, భీమవరం మావుళ్లమ్మ తల్లి, యనమదులూరు పార్వతి సమేత శక్తీశ్వరస్వామి, కాళ్లకూరు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, ఆచంట బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, నత్తా రామేశ్వరం రామేశ్వరస్వామి (త్రిలింగ క్షేత్రం), పెనుగొండ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం దర్శించుకోనున్నట్టు పేర్కొన్నారు. టిక్కెట్టు ధర ఒక్కరికి రూ.500గా నిర్ణయించామని, టిక్కెట్లు కావాల్సిన వారు సెల్ నెంబర్లు 95023 00189, 73829 12141లలో సంప్రదించాలని డిపో మేనేజర్ కె.మాధవ్ కోరారు.

నేడు 'బుద్ధునితో నా ప్రయాణం' నాటక ప్రదర్శన



కరపత్రాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పాత బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ భవన్‌లో శనివారం సాయంత్రం 6గంటలకు అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారితో 'బుద్ధునితో నా ప్రయాణం-డాక్టర్ అంబేడ్కర్ నాటకాన్ని ఉచితంగా ప్రదర్శిస్తున్నట్టు నాటక ఆహ్వాన కమిటీ కన్వీనర్ పి.రామారావు కోరారు. శుక్రవారం అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మా ట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎస్పీ బిందుమాధవ్ హాజరవుతారన్నారు. సమావేశంలో ఎన్.పెద్దిరాజు, కె.రామారావు, జి.కింగ్, బి.కుమార్, కె.మౌర్య పాల్గొన్నారు.

సముద్ర తీవ్రతను ప్రభుత్వానికి తెలియజేస్తాం



ఉప్పాడ తీరాన్ని పరిశీలిస్తున్న దేవులనాయక్

కొత్తపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ సముద్ర కోత తీవ్రతను ప్రభుత్వానికి తెలియజేస్తామని పౌరసరఫరాల శాఖ మేనేజరు, కొత్తపల్లి మండల ప్రత్యేకాధికారి ఎం.దేవులనాయక్ చెప్పారు. రెండు రోజుల క్రితం సముద్రం ఉప్పొంగడంతో మాయాపట్నంలో నిరాశ్రయులైన మత్స్యకారుల కుటుంబాలను శుక్రవారం ఆయన సందర్శించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి వెళ్లడం తప్ప సముద్ర కోతను పూర్తిగా నివారించలేకపోతున్నారని పలువురు మత్స్యకారులు ప్రత్యేకాధికారి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారులకు జరిగిన నష్టంపై వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని నాయక్ తెలిపారు. ఆయన వెంట కొత్తపల్లి తహశీల్దారు జి.చిన్నారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ వున్నారు.

నూతన ఎంపీడీవోలకు ప్రత్యేక శిక్షణ తరగతులు

● 28 నుంచి ప్రారంభం ● విస్తరణ శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ ప్రసాదరావు



సామర్లకోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్ర ఆవరణలో నూతనంగా పదోన్నతులు లభించిన 46 మంది ఎంపీడీవోలకు నెల రోజుల పాటు జరిగే ప్రాథమిక శిక్షణ తరగతులు ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్నట్టు విస్తరణ శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ కెఎన్వీ ప్రసాదరావు శుక్రవారం సాయంత్రం తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన నూతనంగా పదోన్నతులు పొందిన 89 మంది ఎంపీడీవోలకు రెండు బ్యాచ్‌లుగా శిక్షణ తరగతులు రెసిడెన్షియల్ పద్ధతిన నెల రోజుల పాటు జరుగనున్నట్టు తెలిపారు. మొదటి బ్యాచ్ తరగతులకు 46 మంది ఈ నెల 28నుంచి హాజరుకానున్నట్టు తెలిపారు. రెండో బ్యాచ్‌లో 43 మంది నెల రోజుల పాటు శిక్షణ పొందుతారన్నారు. పంచాయతీ విస్తరణాధికారులు, పరిపాలనాధికారులుగా పనిచేసిన వీరందరికీ ఇటీవల ప్రభుత్వం ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించిందన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో వివిధ అంశాల్లో నిష్ణాతులైన ఫ్యాకల్టీలతో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యక్రమాలు, గ్రామ పంచాయతీ, మండల పరిషత్ పరిపాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమగ్ర శిక్షణ తరగతులు నిర్వహించేలా రూపొందించామన్నారు. శిక్షణలో పాల్గొనే ఎంపీడీవోలకు వసతి, బస తదితర సదుపాయాలు శిక్షణాకేంద్ర ఆవరణలోనే ఏర్పాట్లు చేసామని ప్రిన్సిపాల్ ప్రసాదరావు తెలిపారు.

పరామర్శకు పయనం.. అంతలోనే ప్రమాదం!

- ఆటోను ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్ బస్సు
- అక్కడికక్కడే ముగ్గురు మృతి
- ఒకరికి తీవ్ర గాయాలు
- మృతుల్లో తల్లీ కూతురు



సంఘటనా స్థలంలో మృతదేహాలు, ఆటో



మృతిచెందిన తల్లి దుర్గ, కుమార్తె భవాని (ఫైల్)





ఆటోడ్రైవర్ కుమార్ మృతదేహం, ఫైల్

తాళ్లరేవు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల పంచాయతీ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ముగ్గురుఅక్కడికక్కడే మృతిచెందారు. కోరింగ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ ఏటిమొగ నుంచి పోతాబత్తుల దుర్గ(50), కుమార్తె లంకె భవాని (28), వారి బంధువు ఓలేటి లక్ష్మి తాళ్లరేవు మండలం గాడిమొగ పంచాయతీ పరిధి చినవలసల గ్రామంలో ఉన్న దుర్గ మరో కుమార్తె సంగాడి సత్యవతి భర్త గంగరాజు కంటి ఆపరేషన్ చేయించుకోవడంతో పరామర్శించేందుకు శుక్రవారం కాకినాడ నుంచి ఆటోలో బయలుదేరారు. ఆటో తాళ్లరేవు మండలం పటవల పంచాయతీ రామన్నపాలెం వచ్చేసరికి యానాం నుంచి కాకినాడకు వేగంగా వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు ఎదురుగా ఢీకొంది. దీంతో ఆటోలో ఉన్న తల్లి, కూతురు దుర్గ, భవానితో పాటు యానాం కురసాంపేటకు చెందిన ఆటో డ్రైవర్ కురాకుల కుమార్(22)అక్కడికక్కడే మృతిచెందారు. లక్ష్మికి తీవ్రగాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. మృతదేహాలను అంబులెన్స్‌లో కోరింగ పోలీసులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాకినాడ రూరల్ సీఐ చై తన్యకృష్ణ, కోరింగ ఎస్‌ఐ సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కోరింగ ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన ట్రావెల్ బస్సును కోరింగ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సత్యదేవుడి ఆవిర్భావ వేడుకలు

ఘనంగా ప్రారంభం

నేడు ప్రత్యేక పూజలు



స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు



ప్రత్యేక అలంకరణలో స్వామి,అమ్మవార్లు

అన్నవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి 135వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు అనివేటి మండపంలో స్వామి,అమ్మవార్లను వెండి సింహాసనంపై ఆశీనులు గావించి పండితులు గణపతిపూజతో కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం రుత్విక్‌లకు దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, ఛైర్మన్ రోహిత్ దీక్షావస్త్రాలను అందజేశారు. రుత్విక్‌వరుణలు జపములు, పారాయణలు, సూర్యనమస్కారములు, కలశస్థాపన గావించారు. సాయంత్రం 3.30కి అగ్నిప్రతిష్ఠాపన పవమాన హోమములు నిర్వహించారు. స్వామివారు శ్రావణ శుద్ధ విదియరోజున రత్నగిరిపై ఆవిర్భవించారు. దీనిలో భాగంగా శనివారం శ్రావణశుద్ధ విదియ సందర్భంగా వేకువజామున 2గంటలకు స్వామి,అమ్మవార్లకు సుప్రభాతసేవ, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకములు, పంచామృతాభిషేకములు నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 9గంటలకు ఆయుష్యహోమం ప్రారంభించి 11గంటలకు పూర్ణాహుతి గావిస్తారు. అనంతరం ఉదయం స్వామి, అమ్మవార్లకు వెండిరథంపై ప్రాకారసేవ, రాత్రికి గరుడవాహనంపై గ్రామసేవ జరుగుతుందని దేవస్థానం అధికారులు తెలిపారు.

చండీహోమం

రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో చండీహోమం జరిగింది. అర్చకులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బతికుండగానే బలి...!

- ఆన్‌లైన్ డేటా ఎంట్రీలో తప్పుడు సమాచారం
- చనిపోయినట్టు ఉండడంతో ప్రభుత్వ పథకాలకు దూరం
- లబోదిబోమంటున్న ఆదివాసీలు



ఆన్‌లైన్ డేటాలో మృతిచెందినట్టు చూపుతున్న బాధితులు

చింతూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వారంతా బతికే ఉన్నారు. ఐతే ఆన్‌లైన్ డేటాలో వారిని చంపేశారు. డేటా ఎంట్రీ తప్పు వల్ల వారంతా ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. అల్లూరి జిల్లా చింతూరు మండలం చిడుమూరు గ్రామ పంచాయితీ చిడుమూరు, జువ్విగూడెం, బుర్కనకోట గ్రామాల్లో పలు కుటుంబాలు డేటా ఎంట్రీదారుల నిర్లక్ష్యానికి బలయ్యారు. చిడుమూరుకు చెందిన మోసం రుతు వయస్సు 17ఏళ్లు. డేటా ఎంట్రీలో మృతి చెందినట్టు చూపడంతో పాఠశాలలో చదువుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. జువ్విగూడెనికి చెందిన ముర్రం మీన, సోడె రంగమ్మ, ముర్రం తిరుపతమ్మ, బుర్కనకోటకు చెందిన కుంజా ముత్తమ్మ, చిడుమూరుకు చెందిన సవలం నాగమ్మ వితంతువులు. భర్తలు కాలం చేయడంతో చేతి కష్టంతో బతుకుసాగిస్తున్నారు. ఐతే వారందరినీ డేటా ఎంట్రీలో చంపేశారు. దీంతో వీరంతా వితంతు పింఛనకు దూరమయ్యారు. అదే దశలో జువ్విగూడెనికి చెందిన కుంజా ఏసుబాబు, ముర్రం రాజు పేర్లు కూడా డేటా ఎంట్రీలో లేకపోవడంతో రేషను పొందే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో బాధితులంతా ఎన్నో రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయినా ఎవరూ పరిష్కారం చూపడంలేదు. దీంతో నష్ట పోవాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. మరి తమ గోడును పట్టించుకునేదెవరని బాధితులు వాపోతున్నారు.

‘అన్నవరం’లో అవకతవకలు.. ఈవో చర్యలు

రూ.30 లక్షలు నకిలీ పీఎఫ్ చలానాలకు సంబంధించి ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

రూ.84 లక్షల జీఎస్టీ వసూలులో నిర్లక్ష్యం వహించిన నలుగురికి నోటీసులు

అన్నవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో జరుగుతున్న అవకతవకలు దీనివెనక ఉన్న పాత్రధారులపై చర్యలకు ఈవో వీర్ల సుబ్బారావు ఉపక్రమించారు. ఇటీవల దేవస్థానం శానిటరీ కాంట్రాక్టర్ కనకదుర్గ మ్యాన్‌పవర్ సర్వీసెస్ సంస్థ కార్మికులకు పీఎఫ్ చెల్లించకుండా రూ.30 లక్షలు నకిలీ చలానాలను అందించి దేవస్థానం నుంచి బిల్లులు పొందడం కార్మికుల ఫిర్యాదుతో విషయం బయటపడింది. దీంతో సంబంధిత కాంట్రాక్ట్ సంస్థపై దేవస్థానం ఫిర్యాదుచేయగా దీనిలో భాగస్వామ్యం అయిన దేవస్థానం శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ మురాలశెట్టి రామకృష్ణను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఈవో ఉత్త ర్వులు జారీ చేశారు. మార్చి నెలలో సూపరెంటెండెంట్‌గా విధులు నిర్వహించి ప్రస్తుతం సింహాచలం దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న బలువు సత్యశ్రీనివాస్‌కు చార్జిమెమో ఇచ్చారు. దేవస్థానంలో 2023 నుంచి టోల్‌గేట్ లీజుదారు నుంచి జీఎస్టీ, లీజు బకాయి సుమారు రూ.84 లక్షలు వసూలు చేయకుండా నిర్లక్ష్యం వహించిన అప్పటి సూపరెంటెండెంట్ కిషోర్, ప్రస్తుతం సెలవులో ఉన్న సీనియర్ అసిస్టెంట్ వోలేటి జగన్నాథానికి చార్జిమెమో, ప్రస్తుత లీజుల విభాగం సూపరెంటెండెంట్ పీవీ.రమణ, జూనియర్ అసిస్టెంట్ వనపర్తి రమేష్‌ను దీనిపై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఆలయ ఈవో ఒక్కసారిగా ఈ నిర్ణయం తీసుకోవడం సంచలనంగా మారగా దేవస్థానం ఉద్యోగుల్లో గుబులు రేకెత్తిస్తోంది.

పురుగుల మందుల దుకాణంలో తనిఖీలు

గొల్లప్రోలులో రూ.1.14 లక్షల విలువైన స్టాక్ సీజ్

గొల్లప్రోలు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలులోని పురుగుల మందు దుకాణం హనుమాన్ ట్రేడర్స్‌లో వ్యవసాయాధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. షాపుపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో దుకాణం నిర్వాహకులు అందుబాటులో లేకపోవడంతో 2రోజుల క్రితం అధికారులు సీలు వేశారు. శుక్రవారం సీలు తొలగించి తనిఖీలు జరపగా స్టాకు నిల్వలు, రిజస్టర్లకు తేడాలు ఉన్నట్టు గుర్తించారు. దీంతో రూ.1,14,625 విలువైన పురుగు మందుల స్టాకును సీజ్ చేశారు. కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం కోర్టుకు పంపుతున్నట్టు తెలిపారు. తనిఖీల్లో వ్యవసాయ శాఖ ఏడీ పి.స్వాతి, గొల్లప్రోలు, పిఠాపురం వ్యవసాయ అధికారులు కేవీవీ సత్యనారాయణ, గంగాధర్ పాల్గొన్నారు.

యూసీఈకేలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

35 మంది విద్యార్థులు ఎంపిక



వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్, అధికారులతో ఎంపికైన విద్యార్థులు

జేఎన్టీయూకే, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ యూసీఈకేలో 2 రోజులు నిర్వహించిన ఎండేవా కంపెనీ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ నుంచి 130 మంది పాల్గొనగా 35 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు పీఆర్వో ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను డాక్టర్ అరవ కరుణ, ప్రిన్సిపాల్ ఎన్.మోహన్‌రావు నిర్వహించగా ఎంపికైన విద్యార్థులను వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్, ఏపీపీఎస్సీ మాజీ ఛైర్మన్ పి.ఉదయభాస్కర్ అభినందించారు.

220 కిలోల గంజాయి స్వాధీనం

ముగ్గురి అరెస్ట్

రాజమహేంద్రవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ అధికారులు వాహనాలు తనిఖీ చేస్తూ భారీగా గంజాయిని స్వాధీనం చేస్తున్నారు. ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గామన్ వంతెన రోడ్‌లోని నయారా పెట్రోలు బంకు సమీపంలో శుక్రవారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. తమిళనాడు రిజిస్ట్రేషను నంబరుతో ఉన్న ఇన్నోవా వాహనంలోని వ్యక్తులు అనుమానాస్పదంగా ప్రవర్తించడంతో వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కారులో 10 బస్తాల గంజాయిని గుర్తించారు. వాటిలోని 220 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని తమిళనాడుకు చెందిన నాగరాజు, సుబ్రహ్మణ్యం, జైసల్వాను అదపులోకి తీసుకున్నామని హనుశ్రీ పేర్కొన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నార్త్‌స్టేషన్ ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు

ఆత్రేయపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన వ్యక్తిని గంజాయితో అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ ఎస్.రాము తెలిపారు. ర్యాలికి చెందిన పువ్వల మణికంఠ వద్ద గంజాయి ఉందన్న సమాచారం మేరకు ఎస్‌ఐ రాము సిబ్బందితో శుక్రవారం దాడి చేసి పట్టుకున్నారు. డిప్యూటీ తహశీల్దార్ రామచంద్రమూర్తి, వీఆర్వో, వీఆర్‌ఏ సమక్షంలో రాము వద్ద నుంచి 470 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కొత్తపేట కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఈ కేసులో మరో ఆరుగురిని అరెస్టు చేయాల్సి ఉందని, వారు పరారీలో ఉన్నారన్నారు.



ర్యాలిలో గంజాయితో వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, మహిళల హాకీ టోర్నమెంట్‌లకు

రూ.19లక్షలు విరాళం

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



కలెక్టర్ షాన్‌మోహన్‌కు రూ. 15 లక్షల చెక్కు ఇస్తున్న అరబిందో ప్రతినిధులు



కలెక్టర్‌కు రూ. 4లక్షల చెక్కును ఇస్తున్న ఆదిత్య విద్యాసంస్థల ప్రతినిధులు

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో కాకినాడలో నిర్వహించనున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, మహిళల హాకీ టోర్నమెంట్‌లకు శుక్రవారం రూ.19 లక్షలు విరాళాలు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో రెండు సంస్థల నుంచి ఆయన చెక్కులను స్వీక రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనిలో అరబిందో ఫార్మ ఫౌండేషన్ నుంచి సీఎస్ఆర్ నిధుల కింద రూ.15లక్షలు విరాళంగా ఇచ్చారన్నారు. అలాగే కాకినాడ ఆదిత్య విద్యా సంస్థలు రూ.4లక్షలు విరాళంగా ఇచ్చాయన్నారు. కాకినాడలో నిర్వహిస్తున్న ఈ రెండు కార్య క్రమాలకు విరాళాలు ఇచ్చిన అరబిందో ఫార్మ ఫౌండేషన్, ఆదిత్య విద్యాసంస్థల ప్రతినిధులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ జీఎం ఎ.శ్రీనివాస్, సీఎస్ఆర్ జీఎం సుధాకర్, ఆదిత్య విద్యాసంస్థల ప్రతినిధులు సుగుణరెడ్డి, శృతిరెడ్డిలు పాల్గొన్నారు.

కొమురం భీం విగ్రహం ధ్వంసం కేసు.. పోలీసుల అదుపులో ముగ్గురు

కూనవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కూనవరం మండలం కోతులగుట్ట ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న కొమురం భీం విగ్రహ ధ్వంసం కేసులో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ లతాశ్రీ కథనం ప్రకారం... ఈనెల 9న అర్ధరాత్రి కొమురం భీం విగ్రహం వద్ద ఫొటోలు తీసుకునేందుకు ముగ్గురు వెళ్లి తుంటరి చర్యలకు పాల్పడ్డారు. ఓ వ్యక్తి సెల్ఫీ దిగేందుకు ప్రయత్నించగా విగ్రహం చేయి ధ్వంసం అయింది. దీంతో వారు అక్కడి నుంచి భయంతో వెళ్లిపోయారు. ఈనెల 11న ఆదివాసీ నాయకులు కుంజా అనిల్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి శుక్రవారం ఈ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఇద్దరు మైనర్లు ఉన్నట్టు తెలిపారు. ముగ్గురిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఉధృతంగా శబరి

చింతూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు వద్ద శబరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. 3 రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకల్లో చేరిన వర్షపు నీరు చివరకు శబరిలో కలిసి ఉధృతంగా మారింది. భద్రాచలంలో శుక్రవారం సాయంత్రానికి గోదావరి ప్రవాహం 25 అడుగుల మేర ప్రవహిస్తోంది. సోమవారం సాయంత్రానికి 30 అడుగుల ప్రవాహానికి చేరుకునే అవకాశం ఉన్నట్టు సీడబ్ల్యుఎస్ అంచనా వేస్తోంది.



చింతూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శబరి

మావోయిస్టు దళ సభ్యురాలు లొంగుబాటు



లొంగిపోయిన దళ సభ్యురాలికి ప్రోత్సాహకాన్ని అందిస్తున్న ఓఎస్డీ, అధికారులు

ఎటపాక, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలానికి చెందిన సీపీఐ మావోయిస్టు పార్టీ దళ సభ్యురాలు కొవ్వాసి దేవే అలియాస్ సుమిత్ర పోలీసులు ఎదుట లొంగిపోయినట్టు ఓఎస్డీ జగదీష్ అడహిళ్లీ తెలిపారు. దీనికి సంబంధించి శుక్రవారం ఎటపాక పోలీస్ స్టేషన్‌లో విలేకర్లకు వివరాలను వెల్లడించారు. ఛత్తీస్‌గడ్‌లోని సుక్మా జిల్లా కొంటా పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంగరాజపాడుకిచెందిన దేవే 22 ఏళ్ల వయసులో ఏరియా కమిటీ సభ్యుడు, కొంటా ఎల్‌వోఎస్ కమాండర్ మడకం కోసిని ఆదర్శంగా తీసుకుని దళంలో చేరినట్టు చెప్పారు. 2024 జనవరిలో ఈమెతో పాటు మడివి హిడ్మా బెటాలియన్ కమాండర్‌తో పాటు 900 మంది దళ సభ్యులు చత్తీస్‌గడ్‌లోని ధర్మవరం పోలీస్ క్యాంపుపై దాడిలో పాల్గొన్నట్టు పేర్కొన్నారు. లొంగిపోయిన దేవే పై రూ.లక్ష రివార్డు ఉందని ఓఎస్డీ తెలిపారు. ఈయనతో పాటు సీఐ కన్నపరాజు, ఎస్‌ఐ అప్పలరాజు ఉన్నారు.

చెక్ బౌన్స్ కేసులో మహిళకు జైలు శిక్ష

రాజమహేంద్రవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): చెక్ బౌన్స్ కేసులో మహిళకు జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరంలోని ఎనిమిదో అదనపు జిల్లా అండ్ సెషన్స్ కోర్టు తీర్పు చెప్పింది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని సుమ స్కూల్, రాజానగరంలోని సుమ రిఫైనరీలో డైరెక్టర్‌గా ఉన్న ఉప్పులూరి వీర వెంకట కాశీ నాగకుమారి వేసిన వెంచర్‌లో నగరానికి చెందిన ముళ్లపూడి లలితాదేవి స్థలాల కొనుగోలుకు రూ.15లక్షలు అడ్వాన్సుగా ఇచ్చారు. అయితే ఆమె ఓ ఒప్పందం ఉల్లంఘించడంతో లలితాదేవి నిలదీయగా ఆమెకు రూ.19లక్షలు చెక్కు ఇచ్చారు. చెక్కు బౌన్స్ కావడంతో లలితాదేవి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో రూ.33,09,325 నగదును 9% వడ్డీతో లలితాదేవికి చెల్లించడంతోపాటు నాగ కుమారికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది.





తీరం.. కోత భారం!

కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో అలల ఉధృతి కారణంగా ఉప్పాడ, సూరాడపేట, మాయపట్నం గ్రామాల్లో మత్స్యకారుల ఇళ్లు కోతకు గురికావడంతో వారి మనసులు ఎంతో భారంగా మారాయి.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

మరిడమ్మకు స్వర్ణ పుష్పార్చన



పెద్దాపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం వేద పండితుల పర్యవేక్షణలో అర్చకులు బంగారు, వెండి పుష్పాలతో అర్చన జరిపారు. సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి, సిబ్బంది రమణ, క్రాంతివీర్ పాల్గొన్నారు.

పోస్టల్ పెన్షనర్ల ధర్నా

కాకినాడ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ పెన్షనర్స్ సెంట్రల్ హెడ్ క్వార్టర్స్ పిలుపు మేరకు శుక్రవారం కాకినాడ మెయిన్ రోడ్‌లోని ప్రధాన తపాలా కాక్యాలయం వద్ద సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్, ఆలిండియా పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆల్ ఇండియా పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ కాకినాడ డివిజన్ అధ్యక్షుడు జీవీ లక్ష్మీనారాయణ, కార్యదర్శి తురగా సూర్యారావు, కేంద్ర ప్రభుత్వ పెన్షన్ సమాఖ్య అధ్యక్షుడు శ్రీరంగయ్య, కార్యదర్శి ఎస్వీఎన్ సాయిరాం, ఫైనాన్స్ కార్యదర్శి జి.సర్వేశ్వరరావు, ఏపీ పీఆర్‌పీఏ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సత్తిరాజు, కార్య నిర్వాహక సభ్యులు డి.మాణిక్యాలరావు, ఎం.త్రినాథరావు, జి.భాస్కరరావు, బి.వెంకట రమణమ్మ, సీహెచ్‌వీజే మునేశ్వరరావు, డి.వీరభద్రరావు, ఎం.కూర్మారావు, వై.కామేశ్వరరావు, కొయ్య వీర్రాజు, సీహెచ్ఎల్ గణపతి పాల్గొన్నారు.



మెయిన్‌రోడ్డులోని ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

'ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నాం'

పెద్దాపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. గ్రీన్ ట్యాక్స్ తగ్గించినందుకు కృతజ్ఞతగా పాండవుల మెట్ట వద్ద గల లారీ ఓనర్స్ అసోసి యేషన్ కార్యాలయ ఆవరణలో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు), లారీ యూనియన్ గౌరవాధ్యక్షుడు మట్టే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న లారీ ఓనర్స్ సంఘ నాయకులు

ఆస్తి ఆటో మ్యుటేషన్ సేవపై అవగాహన

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు ఒకటి నుంచి అమల్లోకి తీసుకురానున్న ఆస్తి ఆటో మ్యుటేషన్ సేవ రియల్ టైమ్ ఇంటిగ్రేషన్ కోసం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్, రిజిస్ట్రేషన్ స్టాంపుల విభాగం మధ్య క్రమబద్ధీకరించబడిన ఆటోమేటెడ్ డేటా మార్పిడి యంత్రాంగంపై రెవెన్యూ అధికారులకు అవగాహన తప్పనిసరి అని కాకినాడ సబ్ రిజిస్టర్ రామారావు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా సబ్ రిజిస్టర్ రామారావు పాల్గొని మున్సిపల్ రెవెన్యూ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆగస్టు 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 17 మున్సిపల్ కార్పొరేషన్లలో కొత్త విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకురాన్న నేపథ్యంలో రెవెన్యూ సిబ్బందికి అవగాహన కల్పించారు. అదనపు కమిషనరు కేటీ సుధాకర్, రెవెన్యూ ఆఫీసర్ శిరీష్, ఆర్ఐలు పాల్గొన్నారు.



పిఠాపురం పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీదేవికి కుంకుమార్చన



గొల్లప్రోలు పాత బస్టాండు వద్ద కనకదుర్గమ్మకు ప్రత్యేక అలంకారం



గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో పుష్పాలంకరణలో అపర్ణాదేవి

శ్రావణ శోభ

ఆలయాల్లో అమ్మవార్లకు పూజలు

మహిళల సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

పిఠాపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పాదగయ క్షేత్రంలో శ్రావణ శుక్రవారం పూజలు వైభవంగా జరిగాయి. శ్రావణ మాసంలో తొలిరోజు శుక్రవారం రావడంతో భక్తులు అధికంగా తరలివచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. ఇళ్ల వద్ద శ్రావణ శుక్రవారం నోము ఆచరించే భక్తులు పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. మిగిలిన భక్తులు స్నానాల అనంతరం రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవారు, కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామిలను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోనే శ్రావణ నోము ఆచరించారు. అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన జరిపి విశేషంగా అలంకరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామికి ప్రత్యేక అలంకారం చేశారు. స్వామికి అభిషేకాలు, అమ్మవార్లకు అర్చనలను అర్చకుడు పి.విజయజనార్దనాచార్యులు నిర్వహించారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని కనకదుర్గ ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. పాతబస్టాండు, కరణంగారితోట, ఈబీసీ కాలనీ, దేవీనగరం, రైల్వేస్టేషన్ రోడ్డు ప్రాంతాల్లో అమ్మవార్ల ఆలయాలకు భక్తులు బారులు తీరారు. అమ్మవార్లకు కుంకుమ పూజలు జరిపి ప్రత్యేకంగా అలంకరించారు. ఆయా ఆలయ కమిటీల ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): తాటిపర్తిలో అపర్ణాదేవిని పుష్పాలతో అలంకరించారు. కుంకుమార్చన, సహస్ర నామార్చన జరపగా మహిళలు దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి పూజలు జరపగా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా నగరంలోని ఆలయాలు మహిళలతో సందడిగా కనిపించాయి. టూటౌన్ వద్ద గల రామాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. ఈవో ఆధ్వర్యంలో వ్రతాలు ఆచరించే వారికి పూజా సామగ్రిని ఉచితంగా అందజేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

కరప (ఆంధ్రజ్యోతి): స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రావణమాసం మొదటి రోజు, మొదటి శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణ, సత్యమూర్తి, గోపాలాచార్యులు 300మంది ముత్తయిదువులతో శాస్త్రోక్తంగా వ్రతాలను చేయించారు. ఆలయ ప్రాంగణంలో మహాలక్ష్మి అమ్మవారిని సర్వాంగసుందరంగా అలంకరించి గణపతి పూజ అనంతరం వ్రతాలు జరిపించి ఈ వ్రతాల విశిష్టతను వివరించారు. సామూహిక పూజలకు విచ్చేసిన మహిళలందరికీ దేవదాయ శాఖ తరపున అమ్మవారి ఫొటో, రూపు అందజేశారు. పిఠాపురం శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం, కరప గ్రూపు దేవస్థానాల కార్యనిర్వహణాధికారులు ఆర్.సౌజన్య, టి.రవితేజ, కరప ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయం మాజీ డైరెక్టర్ మెర్ల వీరయ్య చౌదరి, వీఆర్వోల సంఘం జిల్లా మాజీ గౌరవాధ్యక్షుడు చాగంటి వెంకట్రావు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డీఎల్వో సాంబశివరావు, చీర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రైనీ డీఎస్పీకి ఎస్పీ అభినందన



కాకినాడ క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శిక్షణా కాలం పూర్తి చేసుకున్న ట్రైనీ డీఎస్పీ జీవనను ఎస్పీ బిందుమాధవ్ శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు. జీవన తనకు అప్పగించిన ప్రాంతాల్లో విధులను అంకితభావం, పారదర్శకతతో చక్కగా నిర్వర్తించారని ఎస్పీ కొనియాడారు. కష్టతరమైన బందోబస్తుల్లో కూడా చాకచక్యంగా పని చేశారని అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని ఎస్పీ ఆకాంక్షించారు. జీవనకు ఎస్పీ శాలువా కప్పి సత్కరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గొల్లప్రోలు రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం వన్నెపూడి, తాటిపర్తి, చేబ్రోలు, దుర్గాడ గ్రామాల్లో ఆరోగ్య అవసరాల నిమిత్తం ఏడుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.6.85 లక్షలు మంజూరయ్యాయి. జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు శుక్రవారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులు అందజేశారు. పిఠాపురం మండలం చిత్రాడలో రవణం దుర్గాప్రసాదరావుకు వైద్యం నిమిత్తం మంజూరైన రూ.12లక్షల ఎల్‌వోసీని అందించారు. గోదావరి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, నాయకులు బవిరిశెట్టి రాంబాబు, గోపాలకృష్ణ, మొయిళ్ల వీర రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి గెనెల లోవరాజు, పెద్దింశెట్టి వీరబ్రహ్మం, దాసరి లక్ష్మిలకు రూ.3,66,423 మంజూరయ్యాయి. లబ్ధిదారులకు వాటిని చెక్కుల రూపంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ శుక్రవారం గొడారిగుంటలోని తన నివాసంలో అందజేశారు.

28న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వికాస కార్యాలయంలో ఈ నెల 28న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. వివిధ సంస్థల్లో సెంటర్ మేనేజర్, ఈఆర్‌వో, డిజైనింగ్ ఇంజనీర్, సర్వే ఇంజనీర్, సైట్ ఇంజనీర్, టెక్నీషియన్, టెలీ సేల్స్ రిప్రజెంటేటివ్, ఆపరేటర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఎంబీఏ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12వేల నుంచి రూ.25వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు సోమవారం ఉదయం 9 గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76222 నెంబరును సంప్రదించాలన్నారు.

28న గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాంబమూర్తి నగర్‌లో ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5, 8, 9, 10 తరగతులతో పాటు జూనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీల్లో సీట్లు మిగిలాయి. వీటికి ఈ నెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కేవీ సత్యవతి తెలిపారు. ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన సంకురాత్రి చంద్రశేఖర్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 25 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ షాన్‌మోహన్‌ను సంకురాత్రి ఫౌండేషన్ అధినేత చంద్రశేఖర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాకినాడ రూరల్ మండలం పెనుమర్తిలో సంకురాత్రి ఫౌండేషన్ ద్వారా అందించే సేవలను కలెక్టర్‌కు వివరించారు. శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి ద్వారా పేదలకు వైద్యం అందిస్తున్న విధానాన్ని తెలియజేశారు. చంద్రశేఖర్ వెంట సంస్థ ప్రతినిధులు ఉన్నారు.





కాకినాడ 28వ డివిజన్‌లో ఎమ్మెల్యే కొండబాబుకు సత్కారం, కాకినాడ రూరల్ చీడిగలో పేద బాలికకు విద్యా నిధి అందిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

'మెరుగైన పాలనకు కూటమి ప్రభుత్వం కృషి'

కాకినాడ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మెరుగైన పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా శుక్రవారం ఆయన 28వ డివిజన్‌లో మాజీ మేయర్ సుంకర పావని-తిరుమలకుమార్, స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ప్రజల వద్దకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కొండబాబును శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి రెడ్నం సత్తిబాబు, కూటమి నాయకులు యాళ్ల రామకృష్ణ, సుంకర సూర్యనారాయణ, అనసూరి మాధవరావు, దవులూరి భద్రరావు, గొన్నాబత్తుల చక్రపాణి, దొడ్డి వీరేంద్ర, పప్పు రామకృష్ణ, వల్లపుదాసు మంగ, సాలిగ్రామ శ్రీనివాస్, గుర్రాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. చీడిగలో మాజీ ఎంపీటీసీ, టీడీపీ సీనియర్ నాయకుడు గీసాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆడబిడ్డ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే 20 మంది పేద మహిళలకు, ఆడ పిల్లలకు ఒక్కొక్కరికీ రూ.5వేలు విలువైన బాండ్లను అందజేశారు. తొలుత గ్రామంలో టీడీపీ రూరల్ కో-కో-ఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్‌బాబా, నురుకుర్తి, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. కూటమి నాయకులు శిరంగు శ్రీనివాసరావు, పాండ్రంకి రాజు, పితాని అప్పన్న, చలపతి, శ్రీరాములు, వెంకటేశ్వరరావు, లచ్చబాబు, వేణు, శ్రీను పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సంపూర్ణ సంక్షేమం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పట్టణంలోని 27, 28, 29 వార్డుల్లో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు.



సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటలక్ష్మి

ఎక్సైజ్ సీఐగా వెంకటలక్ష్మి

పిఠాపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం ప్రొహిబిషన్-ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా జి.వెంకటలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె జంగారెడ్డిగూడెం, భీమడోలు ఎక్సైజు స్టేషన్లల్లో ఎస్ఐగా పనిచేస్తూ ఇక్కడికి ఉద్యోగోన్నతిపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ సారా తయారీ, అమ్మకాలపై నిఘా ఉంచుతామని తెలిపారు. అవసరమైతే సారా తయారీ, విక్రయదారులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నవోదయం 2.0 విజయవంతానికి కృషి చేస్తానని చెప్పారు.

రోహిత్ పుట్టిన రోజు వేడుకలు

కాకినాడ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో నారా రోహిత్ పుట్టినరోజు వేడుకలను శుక్రవారం పెద్ద మార్కెట్ ఏరియాలో నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళలకు చీరల పంపిణీ, పేదలకు అన్నదానం చేశారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు చెరుకూరి సాయిరాంవర్మ, అంగర కృష్ణ, మండపాక నాగబాబు, అడపా జగదీష్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

'చారిత్రక పెద్దాపురం గౌరవాన్ని కాపాడాలి'

పెద్దాపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చారిత్రక పెద్దాపురం గౌరవాన్ని కాపాడాలని, వ్యభిచారాన్ని పూర్తిస్థాయిలో రూపుమాపాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని వరహాలయ్యపేటలో గల యాసలపు సూర్యారావు భవనంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఎందరో కవులు, రాజవంశాలు, పెద్దాపురం పట్టు, పాండవులమెట్ట వంటి చారిత్రక ఆధారాలు ఉన్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. చరిత్రను పక్కన పెట్టి కేవలం వ్యభిచారాన్ని మాత్రమే చూడడం భావ్యం కాదన్నారు. ఇటువంటి దుష్ప్రచారాలను కట్టడి చేయాలన్నారు. వ్యభిచార వృత్తిపై ఆధారపడిన కుటుంబాలను ఆదుకుని వారికి జీవనోపాధి కల్పించాలన్నారు. వ్యభిచార గృహాలను నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని పలువురు డిమాండ్ చేశారు. సమిష్టి కృషితో పెద్దాపురానికి మంచి పేరు తీసుకురావాలని పలువురు కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నీలపాల సూరిబాబు, విజ్జపు రాజశేఖర్, రఫీ, దాడి బేబీ, సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జోశ్యుల కృష్ణబాబు, సీనియర్ జర్నలిస్ట్ చల్లా విశ్వనాథం, గడిగట్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



రామన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న న్యూడెమొక్రసీ, ఐఎఫ్‌యూటీ నాయకులు

'రామన్న పోరాట స్ఫూర్తి ఆదర్శప్రాయం'

కాకినాడ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): యుక్త వయసులోనే పోరాట సిద్ధాంతాలకు ఆకర్షితుడై తుదిశ్వాస విడిచే వరకు పేద ప్రజల పక్షాన పోరాడిన రామన్న పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు కొనియాడారు. నగరంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో శుక్రవారం న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు విప్పర్తి రామన్న 5వ వర్ధంతి నిర్వహించారు. రామన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గుబ్బల ఆదినారాయణ, బంగారు సత్యనారాయణ, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మోహన్, నాగబాబు, కేవీ రమణ, సతీష్, అడపా రాజు, జి.వెంకటేశ్వరరావు, ఎం.లోవరాజు, షైల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



విభిన్న ప్రతిభావంతులకు వీల్ చైర్లు అందజేస్తున్న దృశ్యం

ఎంపీ సతీష్‌బాబు ప్రజా దర్బార్‌కు 22 అర్జీలు

సామర్లకోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడీబీ రోడ్డు కొప్పవరంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 22 మంది అర్జీలు అందజేశారు. వ్యక్తిగత, వైద్య సమస్యలకు చెంది 4 అర్జీలను సత్వరం పరిష్కరించగా మిగిలిన 18 అర్జీలను పరిష్కారం నిమిత్తం ఆయా శాఖల ఉన్నతాధికారులకు పంపారు. ఇద్దరు విభిన్న ప్రతిభావంతులు తమకు వీల్‌చైర్స్ కావాలని అర్జీలు అందజేయగా వయో వృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయ అధికారులను సంప్రదించి అప్పటికప్పుడు రెండు వీల్‌చైర్లను రప్పించి అందజేశారు. ఆనంద్‌న్యూటన్, నెక్కంటి శ్రీనివాసు, చింతపల్లి అర్జున్, తలాటం హరీష్, జున్నూరు బాబ్జీ, ముత్యాల అనిల్, దుర్గాప్రసాద్, ఏడీ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.



గొడ్డటిపాలెం గ్రామ దేవతకు సారె సమర్పిస్తున్న గ్రామస్తులు

దేవతామూర్తులకు సారె సమర్పణ

కరప, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గొడ్డటిపాలెం గ్రామ దేవత కట్లమ్మ తల్లి, మహాలక్ష్మి, దుర్గాదేవి అమ్మవార్లకు శుక్రవారం గ్రామస్తులు సారె సమర్పించి భక్తితో కొలిచారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా గ్రామంలోని మహిళలు రకరకాల స్వీట్లు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరలు, గాజులను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆయా ఆలయాల్లోని అమ్మవార్లకు నైవేద్యం పెట్టారు. ప్రత్యేక పూజలు చేసి గ్రామ ప్రజలు పాడిపంటలు, సుఖసంతోషాలతో ఉండేలా దీవించమని కోరారు. జనసేన పార్టీ నాయకులు బండారు మురళి, వీరంరెడ్డి ముత్యాలరావు, బత్తుల సతీష్, వీర మహిళలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అసంఘటిత కార్మికుల రిజిస్ట్రేషన్

పిఠాపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు పిఠాపురంలోని కోర్టుల ప్రాంగణంలో శనివారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్టు 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీహరి తెలిపారు. దీనివల్ల కార్మికులకు సంపూర్ణ సామాజిక భద్రత, యూఏఎన్ నెంబర్‌తో కూడిన గుర్తింపు కార్డు లభిస్తుందని, ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యం ఏర్పడినా రూ.2లక్షల వరకు పరిహారం ఇస్తారని వివరించారు.

బీజేపీ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శిగా దత్తాత్రేయ

తాళ్లరేవు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొప్పనాతి దత్తాత్రేయ శివప్రసాద్ వర్మ, జిల్లా కార్యదర్శిగా కొప్పిశెట్టి అనంతలక్ష్మిలను తాళ్లరేవు మండలం నుంచి ఎంపిక చేసినట్టు ముమ్మిడివరం అసెంబ్లీ కో-కన్వీనర్ విత్తనాల కరిమిల స్వామి శుక్రవారం తెలిపారు. వీరి నియామకంపై తాళ్లరేవు మండల నేతలు విజయకుమార్, అజయ్‌వర్మ, రణధీర్ హర్షం వ్యక్తం చేశారు.

మూలపేటలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

కొత్తపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనరు రేణుక ఆదేశాల మేరకు మూలపేట సెజ్ గ్రామాల్లో పిఠాపురం ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. 20లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సారా అమ్మకందారులపై పీడీ చట్టం అమలు చేస్తామని అసిస్టెంట్ కమిషనరు రేణుక హెచ్చరించారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ, ఎక్సైజ్ ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

కత్తిపూడిలో నేడు మంత్రి అచ్చెన్న పర్యటన

శంఖవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కత్తిపూడిలో శనివారం రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని ప్రత్తిపాడు మార్కెట్ యార్డు చైర్మన్ బద్ది మణిరామారావు కోరారు. కత్తిపూడి సొసైటీ అధ్యక్షుడు గాబు కృష్ణమూర్తి ప్రమాణస్వీకారోత్సవంతో పాటు అన్నవరంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి మంత్రి హాజరవుతారని తెలిపారు. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పందిరిమామిడిలో 'సుపరిపాలనలో తొలి అడుగు'



గ్రామంలో కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి, టీడీపీ నేతలు

రంపచోడవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పందిరిమామిడిలో శుక్రవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్న తీరుపై ఆరా తీశారు. అలాగే ఇంటింటికి వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాల కరత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్, టీడీపీ నాయకులు కారం సురేష్‌బాబు, పెంటపాటి అనంతమోహన్, ఏఎంసీ వైస్ చైర్మన్ సలాది బాపిరాజు, అడబాల బాపిరాజు, వై.నిరంజనీదేవి, బాపన్నదొర, చోటు, సింహాచలం, జి.చిన్నబాబు, పండా చెల్లన్నదొర, వెంకన్నదొర, సురేష్, గణపతి, రమణ, జనసేన నాయకుడు పాపోలు శ్రీనివాసరావు, బుచ్చిరాజు పాల్గొన్నారు. అలాగే ఏరియా ఆసుపత్రిలో డాక్టర్లు పనివేళల్లో అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే అన్నారు. శుక్రవారం ఆమె ఏరియా ఆసుపత్రిని సందర్శించి అసంతృప్తి వ్యక్తం చేశారు.

దోమల లార్వా నివారణ మందు పిచికారీ

చింతూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దోమల లార్వా నివారణ మందును చింతూరు, వేగితోటలో శుక్రవారం పిచికారీ చేశారు. ఫ్రైడే డ్రైడే లో భాగంగా కార్యక్రమాన్ని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ హాజరై ప్రారంభించారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా చింతూరు డివిజనుకు గాను 45 బ్యాటరీ స్ప్రేయర్లు, ఎనిమిది పవర్ స్ప్రేయర్లను కొనుగోలు చేశారు. వీటి ద్వారా 151 హాట్ స్పాట్ గ్రామాలలో దోమల నివారణ ముందును పిచికారీ చేయించనున్నట్టు జిల్లా ఉప వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పుల్లయ్య తెలిపారు. తులసిపాకల ప్రాథమిక వైద్యశాల డాక్టర్ ఉదయ్‌కుమార్ రెడ్డి, ఏఎంఓ శ్రీనివాసరాజు, ఎంపీడీవో శ్రీనివాస్ దొర సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్‌కు వినతి

మోతుగూడెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం సీలేరు రీజినల్‌లో ఏపీ జెన్కో ఉద్యోగులు, కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ నాయకులు సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ రాజారావుకు వినతిపత్రం అందజేశారు. అర్హులైన ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు ఇప్పించాలని, పొల్లూరు పవర్ ఆఫీస్‌లో ఆర్వో ప్లాంట్ ద్వారా తాగునీరు అందించాలని, మోతుగూడెంలో తాగునీటి పైపులైను 40 సంవత్సరాలైందని, దాన్ని వెంటనే మార్చాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో జాజుల రత్నాకర్, రీజనల్ సెక్రెటరీ ఎం.లక్ష్మణరావు కోశాధికారి జీ. రవి, బ్రాంచ్ సెక్రటరీ ఎస్.కిరణ్, బ్రాంచ్ ప్రెసిడెంట్ పి. వాసు బ్రాంచ్ జాయింట్ సెక్రెటరీ ఉన్నారు.

కారం తమన్న దొరకు ఘన నివాళి



తమ్మన్నదొర చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

చింతూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం కేంద్రంగా కారం తమన్న దొర పేరుతో జిల్లా ఏర్పాటు చేయాలని ఆదివాసీ జేఏసీ చింతూరు డివిజన్ చైర్మన్ జల్లి నరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం చింతూరులో కారం తమన్న దొర 145వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమన్న దొర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు తిమ్మసాయి, ముచ్చిక సింగయ్య, కారం రంగారావు, కాకా సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం: రంపచోడవరం కేంద్రంగా కారం తమ్మన్నదొరపేరుతో జిల్లా ఏర్పాటు చేయాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పోతవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, బాలురు హాస్టల్‌లో మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కారం తమ్మన్నదొర 145వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కారం సురేష్‌దొర, ఇన్‌చార్జి హెచ్ఎం జి.రాజు, ఉపాధ్యాయులు మడకం రామకృష్ణదొర, ఎం.గోపాల్‌కృష్ణ, బులియమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం : పీవో




సీతపల్లి పీహెచ్‌సీని పరిశీలిస్తున్న పీవో సింహాచలం

రంపచోడవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన సీతపల్లి పీహెచ్‌సీని పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పీహెచ్‌సీలలో సీజనల్ వ్యాధులకు సంబంధించి మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పీహెచ్‌సీలో ఎంతమంది గర్భిణులు, బాలింతలు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు.

'నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి'

కూనవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. కూనవరంలో ఆయన పర్యటించి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్అండ్ఆర్ కాలనీలు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. తాగునీటి సమస్యతో నిర్వాసితులు ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు ముంపునకు గురయ్యే వారికి తక్షణమే పునరావాసం కల్పించాలన్నారు. డ్యాంను ఒకేసారి నిర్మిస్తున్నారు... కాబట్టి నిర్వాసితులకు ఒకేసారి పరిహారం అందించాలన్నారు. ముంపు మండలాల్లో సంబంధిత మంత్రులు, అధికారులు పర్యటించాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే జాతీయస్థాయిలో ఉద్యమిస్తామన్నారు. ఆగస్టు 16, 17 తేదీల్లో సీపీఎం కేంద్ర నాయకత్వం ముంపు మండలాల్లో పర్యటిస్తుందన్నారు.

విలీన మండలాలతో ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయండి



మంత్రికి సమస్యలు వివరిస్తున్న శ్రీనివాస్

ఎటపాక, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విలీన మండలాల ప్రజల పరిపాలనా సౌలభ్యం రీత్యా పోలవరం ముంపు మండలాలను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తొలుగుతాయని, ఆ దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని అరకు పార్లమెంటరీ కార్యదర్శి ముప్పా శ్రీనివాస్, ఎటపాక వైఎస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు ఈమేరకు శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి, హోంమంత్రి అనితను కలిసి విన్నవించారు. 2024 ఎన్నికల హామీలో సీఎం చంద్రబాబు పోలవరం ముంపు మండలాలను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఆ హామీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రావి మాధవరావు, పెనుబల్లి సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌పై 28న మెజిస్ట్రీరియల్ విచారణ

వై.రామవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శేషరాయి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై సోమవారం రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో మెజిస్ట్రీరియల్ విచారణ చేపడుతున్నట్టు తహశీల్దార్ వేణుగోపాల్ తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

శ్రావణశోభ ప్రారంభం

భక్తులతో కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు



ధర్మవరం కనకదుర్గ ఆలయంలో పూజలు చేసుకుంటున్న మహిళలు

ప్రత్తిపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం ముగిసి శుక్రవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభమైంది. తొలి శుక్రవారం కావడంతో మండలంలోని అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్తిపాడు, ధర్మవరం, ఒమ్మంగి, రాచపల్లి, శరభవరం, ఏలూరు, లంపకలోవ,పెద్దిపాలెంలలో కనకదుర్గ అమ్మవార్ల ఆలయాలతో పాటు గ్రామదేవతల ఆలయాలు భక్తులతో కోలాహలంగా మారాయి.

శ్రావణమాస పూజలు

కిర్లంపూడి: శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా మండలంలోని చిల్లంగిలో శ్రీ అష్టలక్ష్మి సమేత లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గాజుల అలంకరణలో శ్రీవరలక్ష్మి

తునిరూరల్: స్థానిక చిట్టూరి మెట్రో నందు వేంచేసిఉన్న శ్రీవైకుంఠ నారాయణ సహిత శ్రీవరమహాలక్ష్మి అమ్మవారిని శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా గాజులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారికి అభిషేకం, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

జగ్గంపేట: శ్రావణమాసం ప్రారంభం తొలి శుక్రవారం కావడంతో ఆలయాల్లో శ్రావణ శోభ సంతరించుకుంది. జగ్గం పేటలో సర్వకామదాము సమేత ఉమాచంద్రశేఖర్‌స్వామి రుక్మిణి సత్య భామ సమేత శ్రీ రాజగోపాల్ స్వామి ఆలయంతో పాటు, కనకదుర్గమ్మ తల్లి, గ్రామదేవత రావులమ్మ తల్లి ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. గృహా ల్లో లక్ష్మీదేవి అమ్మవారిని అలంకరించి కలశాలు ఏర్పాటు చేసి ధూపదీన నైవేద్యాలతోపాటు వరలక్ష్మి వ్రత కథ చదివి వరలక్ష్మి వ్రతాలు చేసుకున్నారు.



గాజుల అలంకరణలో శ్రీవర మహాలక్ష్మి అమ్మవారు

పెదశంకర్లపూడిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రత్తిపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదశంకర్లపూడి కార్యాలయం వద్ద టీడీపీ కార్యాలయం వద్ద శుక్రవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. నియోజకవర్గవ్యాప్తంగా వివిధ రకాల సమస్యలపై వచ్చిన బాధితుల సమస్యలను అధికారులకు వివరిస్తూ పరిష్కార చర్య లు చేపట్టారు. తాగునీరు, రహదారులు, పింఛన్లు, రేషన్ కార్డులు, తదితరఉపాధి పనులు తదితర అంశాలకు సంబంధించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.



పెదశంకర్లపూడిలో సమస్యల పరిష్కారానికి అధికారులకు ఫోన్ చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

మెట్టలో ఎడతెరిపిలేని వర్షం

● ముంపునీటి మళ్లింపునకు చర్యలు



ప్రత్తిపాడులో కురుస్తున్న వర్షం



వర్షపునీరును మళ్లిస్తున్న పంచాయతీ సిబ్బంది

ప్రత్తిపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని 7,8 వార్డుల్లో ముంపునీటిని మళ్లించేందుకు శుక్రవారం గ్రామ పంచాయతీ చర్యలు చేపట్టింది. గత 5 రోజులుగా భారీ వర్షాల కారణంగా గోకవరపు వీధిలోని 7,8 వార్డుల్లో వర్షపునీరు నిలిచిపోయింది. దీంతో 60 కుటుంబాలు నీటిబెడదతో ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచ్ గుడాల విజయలక్ష్మీ వెంకటరత్నం ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు, సిబ్బంది ముంపునీటిని దేవుపల్లి చెరువు కాలనీకి మళ్లించే చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ గ్రామంలో డ్రైన్ల ఏర్పాటు కు తోడ్పాటునందిస్తున్నారని, అలాగే గోకవరపు వీధి 7,8 వార్డుల్లో వర్షపునీరు, మురుకినీరు సజావుగా దిగువకు వెళ్లేందుకు పక్కా డ్రైన్‌లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మెట్టలో వర్షం

మెట్ట ప్రాంతానికి ముసురు పట్టింది. చెరువుల్లోకి భారీఎత్తున వర్షపునీరు చేరుకుంటుంది. శుక్రవా రం కూడా ఉదయం నుంచి సాయంత్రంవరకు వర్ష కురిసింది. ఖరీఫ్ వ్యవసాయానికి ఈవ ర్షాలు మేలు చేకూర్చనున్నాయని రైతులు చెబుతున్నారు.

జగ్గంపేట: జగ్గంపేటలో శుక్రవారంరాత్రి 7 గంటల నుంచి ఏకధాటి వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలకు నీరు చేరింది. రాత్రంతా కూడా ఇదే వర్షం కురిస్తే కొంతమేర ముంపునకు గురవుతాయని రైతులు చెప్తున్నారు.

స్థిర ఆదాయాన్నిచ్చే పంట పామాయిల్ : ఎమ్మెల్యే నెహ్రూ

గండేపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురారిలో శ్రీవెంకటేశ్వర కాకతీయ కల్యా ణ మండపంలో శుక్రవారం ఆయిల్‌పామ్‌తోటల విస్తరణ మహోత్సవం ఉద్యానశాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంయుక్తంగా నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొక్కలు నాటి గ్రామానికి చెందిన రైతులకు ఆయిల్ పామ్ మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పామాయిల్ రైతుకు స్థిర ఆదాయం ఇచ్చే పంటగా నిలుస్తుందన్నారు. గండేపల్లి మండలం రైతులు జిల్లాలోనే పామాయిల్ సాగులో అందరికంటే ముందు వరుసలో ఉంటారన్నారు. ఇక్కడి నీటి సదుపాయాలు తక్కువ ఉన్న పంట దిగుబడి ఏవిధంగా అత్యధికంగా తీయాలో వారికి బాగా తెలుసునన్నారు. కార్యక్రమంలో పతంజలి ప్లాంటేషన్ విభాగాధిపతి వి.పట్టాభిరామిరెడ్డి, జిల్లా ఏపీఎంఐపీడీ జీవీవి వరప్రసాద్, జిల్లా ఉద్యాన శాఖాధికారి జి.విజయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ అడపా భరత్‌కుమార్, టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, మురారి ఉపసర్పంచ్ జాస్తి వసంత్, జగ్గంపేట ఏడీఏ జి.శ్రీనివాస్, ఉద్యాన అధికారిణి ఎ.శ్రీవల్లి, ఎంపీడీవో కె.చంద్రరావు, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, ఏవో రెడ్ల శ్రీరాం, పతంజలి సిబ్బంది ఎస్.వీర్రాజు, టివిఎస్ మణీంద్ర, వి.నరేశ్, బి.దుర్గాప్రసాద్, రైతులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట సీఐ, ఎస్ఐలకు ఎస్పీ అభినందనలు



ఎస్ఐకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

జగ్గంపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం ఎస్పీ కార్యాల యంలో నిర్వహిం చిన నెలవారి నేర సమీక్ష సమావేశంలో జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, ఎస్ఐలు రఘునాథరావు, శివనాగబాబును ఎస్పీ బిందుమాధవ్ అభినందిస్తూ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈనెల 5న శనివారం నిర్వహించిన మెగా జాతీయ లోక్‌అదాలత్ ద్వారా జగ్గంపేట పోలీస్ స్టేషన్‌లో 116, గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో 116 కేసులలో కక్షి దారులు, ఫిర్యాదుదారులు, ఇరు వర్గాల సభ్యులను సమన్వయం చేసుకుంటూ వారితో మాట్లాడి వారి కేసులను లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా పరిష్కారానికి అత్యధిక స్థాయిలో కృషిచేసి జిల్లాలో జగ్గంపేట, గండేపల్లి ప్రథమం నిల వడంతో జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాథరావు, గండేపల్లి ఎస్ఐ శివ నాగబాబును ఎస్పీ అభినందించారు.

కళాకారుడికి సన్మానం

ప్రత్తిపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రౌతుపాలెంలో సాయినాధుడి ఆలయం వద్ద శుక్రవారం కళాకారుడు సత్యంశెట్టి అమ్మ న్నను గ్రామపెద్దలు సన్మానించారు. శ్రీకృష్ణనంద బాల భక్త భజన సమాజం ఆధ్వర్యంలో అమ్మన్నకు శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి సేవలను కొనియాడారు. రామిశెట్టి నాని, ధర్మపురి శేషు, గోళ్ళ తేజ, కరసూదుల శేఖర్, సత్యంశెట్టి సాయి చరణ్, కోలా వెంకటేశ్వరరావు, బర్రే బులికాపు తదితరులు పాల్గొన్నారు.



రౌతులపాలెంలో కళాకారులను సన్మానిస్తున్న గ్రామపెద్దలు

నిలకడగా ముద్రగడ ఆరోగ్యం

● తనయుడు బాలు

ప్రత్తిపాడు,జూలై 25(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం నిలకడగా ఉందని ఆయన తనయుడు ముద్రగడ వీరరాఘవరావు (బాలు) చెప్పారు. శుక్రవారం ఆయన స్థానిక విలే కర్లతో మాట్లాడుతూ తమ తండ్రి ఆరోగ్యం విషయంలో అభిమానులు కార్యకర్తలు ఆందోళనకు గురికావద్దన్నారు. ఆలయాల్లో పూజలు, ప్రార్థనలు చేస్తున్న ప్రజల అభిమానానికి తామంతా రుణపడి ఉంటామన్నారు. తన సోదరుడు గిరిబాబు తమ తండ్రి ఆరోగ్యం మెరుగుపడేలా ఎప్పటికప్పుడు వైద్యులతో సంప్రదించి జాగ్రత్తలు తీసుకుంటున్నారని బాలు తెలిపారు.

ముద్రగడ కోలుకోవాలని వాకపల్లిలో పూజలు

ప్రత్తిపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురై హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కోలుకోవాలని కోరుతూ ఆయన అభిమానులు, కార్యకర్తలు మండలంలోని వాకపల్లిలో మాతా మహాశక్తి పీఠంలో మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నమ య్య కళాక్షేత్ర ఉత్తర కోస్తా జిల్లాల అధ్య క్షుడు సానా నూకరాజు నాయుడు, అభి మానులు తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం త్వరగా కోలుకోవాలని కోరుతూ శుక్రవారం మాజీ సర్పంచ్ పెంకటో నాగబాబు ఆధ్వ ర్యంలో శ్రీనూకాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కామ్రేడ్ రాజారావు ఆశయ సాధనకు కృషి



రాజారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

జగ్గంపేట, జూలై 25(ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ శాగంటి రాజారావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు అన్నారు. జగ్గంపేటలో శుక్రవారం స్టాలిన్ భవనంలో కామ్రేడ్ శాగంటి రాజారావు వర్ధంతి సభ నిర్వహించారు. స్టాలిన్ భవన నుంచి అరుణోదయ కళాకారులతో ర్యాలీ నిర్వహించారు. స్టాలిన్ భవన్‌లోని స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పెద్దాపురం డివిజన్ కార్య దర్శి వి.చిట్టిబాబు ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎస్.లక్ష్మి, పీఓడబ్ల్యు జిల్లా అధ్యక్షుడు పి.విజయ, ఏఐకేఎంఎస్ డివిజన్ కమిటీ సభ్యులు కె.బాబురావు, ఎన్.వరద రాజు, బిల్డింగ్స్ వర్కర్స్ యూనియన్ స్టేట్ కమిటీ సభ్యులు కారుకొండ శ్రీను, మొరుకుర్తి రాజు, అరుణోదయ ధర్మ రెడ్డి, సుగ్గిరెడ్డి పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు వీడ్కోలు

కిర్లంపూడి, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగపతినగరం పంచాయతీ పరిధిలో 4 గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వర్తించి సాధారణ బదిలీల్లో భాగంగా వేరే ప్రాంతాలకు వెళ్తున్న సచివాలయ ఉద్యోగులను, బదిలీపై నూతన ఉద్యోగులను శుక్రవారం సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు, సొసైటీ చైర్మన్ కుర్ల చినబాబు, నాయకులు తూము కుమార్, కాళ్ల వెంకటేష్ సత్కరించారు. ఎంపీడీవో బి.హరికృష్ణ, కార్యదర్శి ఎన్టీఆర్ రమేష్‌బాబు, డివిఆర్ సూరిబాబు, నాయకులు ఆళ్ల నానాజీ, బాబులు ఉన్నారు.

28న గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాంబమూర్తి నగర్‌లో ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5, 8, 9, 10 తరగతులతో పాటు జూనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీల్లో సీట్లు మిగిలాయి. వీటికి ఈ నెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కేవీ సత్యవతి తెలిపారు. ఈ అ వకా శాన్ని స ద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రావులమ్మనగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సమక్షంలో గోకవరం సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు ఆధ్వర్యంలో గోకవరానికి చెందిన షేక్ మదీనా సాహెబ్, ఎస్‌కే సంటి సాహెబ్, ఎస్‌కే మదీనా శ్రీను, ఎస్‌కే ఫిరోజ్ ఆలీషా, ఎస్‌కే మహ మ్మద్ అలీ, ఎస్‌కే పఖీర్ మహమ్మద్, ఎస్‌కె పాప సాహెబ్, ఎస్కే రజక్వల్లి, ఎస్‌కె మదీనా (చిన్న) తదితర ముస్లిం సోదరులతో పాటు వైసీపీ కాపు నాయకులు వెలిశెట్టి శివ, పదిలం సూరిబాబు తదితరులు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరారు. వారందరికీ ఎమ్మెల్యే టీడీపీ కండువాలు వేశారు. కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, పిల్ల చంటిబాబు, ఎస్ బాబు, గుబ్బలమ్మ గుడి చైర్మన్ ఆచంట రాజు, పోసిన ప్రసాద్, గోకవరం టౌన్ ప్రెసిడెంట్ పైలా శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ కమిటీ అధ్యక్షులు గునిపే భరత్, మేడిశెట్టి వీరబాబు, జి.సన్యాసిరావు, వెన్ను వీరబాబు పాల్గొన్నారు.

ధ్యానంతో ఒత్తిడిలేని జీవనం

తునిరూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడిలేని జీవనానికి ధ్యానం అవసరమని యోగద సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు స్వామి శ్రీ స్మరణానంద గిరి తెలియజేశారు. శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల్లో విద్యార్థులతో మాట్లాడుతూ లక్ష్యసాధనకు ఏకాగ్రతతో సాధన చేయడానికి ధ్యానం ఒక మార్గమని సూచించారు. ధ్యానం, గురువు ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.ప్రకాష్, యోగద సత్సంగ ధ్యాన మండలి సభ్యులు పాల్గొన్నారు.



స్వామీజీకి జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

'ఆదిత్య'లో ముగిసిన ఎనేబుల్‌మెంట్ ప్రోగ్రాం

గండేపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూని వర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు వారి సారథ్యంలో స్టూడెంట్ ఎనేబుల్‌మెంట్ ప్రోగ్రాం ఫ్రంట్ ఎండ్ వెబ్ డెవలపర్ ముగిసింది. హెచ్‌టిఎంఎల్ ది లాంగ్వేజ్, సిఎస్ఎస్ 3, జావా స్క్రిప్ట్ అనే అంశాలపై నిర్వహించారు.

వలంటీరుతో సచివాలయ విధులు

శంఖవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో గ్రామ వలంటీరుగా పనిచేసిన వ్య క్తి కొంతంగి కొత్తూరు సచివాలయంలో విధులు నిర్వర్తించడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన బాలిపల్లి చక్రి అనే వ్యక్తి దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. విధులపట్ల అలసత్వంగా ఉన్న అగ్రికల్చర్ అసిస్టెంట్‌పై చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

గురుకులంలో జూనియర్ ఎంఈసీ సీట్ల భర్తీకి ఆహ్వానం

తునిరూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక వి.కొత్తూరు సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో జూనియర్ ఎంఈసీలో సీట్లు ఖాళీలు ఉన్నాయని ప్రిన్సిపాల్ డి.ప్రసన్నరాణి తెలిపారు. కుల ప్రాతిపదికన ఎస్సీ1లో 2, ఎస్సీ2లో 7, ఎస్సీ3లో 7, బీసీలో2, బీసీ-సీలో 5 మొత్తం 23 సీట్లు ఉన్నాయన్నారు. ఈ కోర్సులో చేరాలనుకునే వారు టెన్త్ మార్కులిస్టు, ఇతర ధృవీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 8074 079227, 964270019 సంప్రదించాలన్నారు.

జగ్గంపేటలో..

జగ్గంపేట: జగ్గంపేటలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల నందు వివిధ తరగతులకు సంబంధించి సీట్లు ఉన్నాయని ప్రిన్సిపాల్ లలిత కుమారి తెలి పారు. 5వ తరగతిలో ఎస్సీ 28, బీసీసీ 10, ఎస్టీ 3సీట్లు ఉన్నాయని... 10వ తరగతిలో బీసీ 2, ఎస్టీ1, ఎస్సీ 10 సీట్లు ఉన్నాయని... కళాశాలకు సంబంధించి ఎంపీసీ ఎస్సీ4, ఎస్టీ 3 సీట్లు ఉన్నాయని తెలిపారు. అర్హులైన అభ్యర్థులందరూ సోమవారం ఉదయం కళాశాలలో ఉదయం 9గంటల నుంచి దరఖాస్తులకు స్వీకరిస్తామని తెలిపారు.

11 మందిపై బైండోవర్ కేసులు

జగ్గంపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న 11 మందిపై పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. గండేపల్లికి చెందిన ఆరుగురు, ఎర్రంపాలెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి, నాయికంపల్లికి చెందిన మరొకరిపై కేసు నమోదు చేశారు. సూరంపాలెంలో మహిళను వేధిస్తున్న వ్యక్తిపై, గంజాయి అమ్మకాలు సాగిస్తున్న మరి ఇద్దరిపైన కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

పుంగనూరు దూడ చోరీ

ప్రత్తిపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రౌతు పాలెంలో గుండం మణికంఠకు చెందిన పుం గనూరు జాతి దూడ అపహరణకు గురైంది. శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు దూడను అపహరించుకు పోయారని బాధితుడు వాపోయాడు. 4 రోజుల కిందట దూడను రూ.1.50లక్షలకు కొనుగోలు చే యడానికి పలువురు ఆసక్తి చూపారని, గురువారం రాత్రి పశువుల షెడ్డులో ఆవు దూడ లను కట్టి వేయగా శుక్రవారం దూడను అప హరించినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పత్రికా సమాచారం

అల్లూరి సీతా రామరాజు, పాడేరు జిల్లా రంపచోడవరం మండలంలో గల సౌజ ఎయిడెడ్ ప్రైమరీ పాఠశాల, రంపచోడవరం, నందు గల 02 SGT ఉపాధ్యాయుల పోస్టులకు భర్తీ కొరకు Manual / Employment Exchange మరియు Online Web site https://cse.ap.gov.in/ Aided Recruitment Notifications ద్వారా దరఖాస్తు చేసుకొనుటకు గాను Notification జారీ చేయడమైనది.

సదరు Online ద్వారా Submit చేసిన దరఖాస్తులు, విద్యార్హతలు సర్టిఫికెట్లు,Inter, D.Ed అయిఉండాలి. క్రిస్టియన్ మైనారిటీ BC-C (MRO చే జారీచేయబడిన) సర్టిఫికెట్లను, 02 పాస్ పోర్టు సైజు ఫోటోలను దరఖాస్తులనకు జతపరచి కరస్పాండెంట్ సౌజ ఎయిడెడ్ ప్రైమరీ పాఠశాల, రంపచోడవరం వారికి వ్యక్తిగతంగా కాని రిజిస్టరు పోస్టు ద్వారా కాని ది. **26-07-2025** నుండి **04-08-2025**వ తేదీ లోగా సమర్పించవలసినదిగా కోరడమైనది. మరియు సదరు దరఖాస్తుల యందు అర్హత కలిగిన అభ్యర్థులకు Written Test నిర్వహించి, ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులలో ఎంపిక చేయబడిన అభ్యర్థులకు Interview నిర్వహించబడునని తెలియజేయడమైనది. వయోపరిమితి ప్రభుత్వ నిబంధనలకనుగుణంగా ఉండును. అసంపూర్తిగా ఉన్న దరఖాస్తులు తిరస్కరించబడును.

సంబంధిత అర్హత గల అభ్యర్థుల యొక్క Written Test మరియు ఎంపిక చేయబడిన అభ్యర్థులకు Interview నిర్వహించు తేదీలను తరువాత వ్యక్తిగతంగా తెలియజేయబడునని సౌజ ఎయిడెడ్ ప్రైమరి పాఠశాల, రంపచోడవరం వారు తెలియజేసియున్నారు.

కరస్పాండెంట్
సౌజ ఎయిడెడ్ ప్రైమరీ పాఠశాల, రంపచోడవరం